# హామీలు అమలు చేయాలంటే కొడతారా?

-మొదటిపేజీ తరువాయి

ఇవ్వాలని అడిగిన గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం అత్యంత తీవ్రమైన విషయం' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి డిమాండ్లపై ప్రభుత్వం చర్చలు జరపనప్పుడు, ప్రజాస్వామ్యయుతంగా వారి గొంతును వినిపించడం నేరం ఎలా అవుతుందని ప్రశ్నించారు. 'ఆందోళన చేస్తే ఈ రకంగా లాఠీలతో కొడతారా? మహిళలని చూడకుండా గాయపరుస్తారా? ఈడ్చి పడేస్తారా? శాంతియుత ఆందోళనలపై దాడులు చేసే అధికారం మీకు ఎవరిచ్చారు? ధర్నా కోసం వస్తున్న వారిని అడ్డుకుని పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించి నరకయాతన పెడతారా? ధర్నా జరగనీయకుండా పెద్ద సంఖ్యలో ఉద్యోగులను అడ్డగోలుగా సస్పెండ్ చేయడం దారుణం కాదా? చంద్రబాబూ.. ఇది ప్రజాస్వామ్యమేనా? రోజురోజుకూ మీ నిరంకుశత్వం పెరిగిపోతోంది? ఉద్యోగులకు వెన్నుపోటు పొడవడమే మీ లక్ష్యం. అధికారం చేతిలో ఉందికదా అని ఏం చేసినా చెల్లుబాటు అవుతుందని అనుకుంటే ఎలా?' అని నిలదీశారు.

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులే కాదు.. ఇవాళ ఏ ఉద్యోగి అయినా రోడ్డెక్కుతున్నారంటే కారణం మేనిఫెస్టోలో మీరు హామీలు ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఉద్యోగులందరికీ వెన్నుపోటు పొడవటమే అన్నారు. మీరు అధికారంలోకి వస్తానే ఐఆర్ అన్నారు. పీఆర్సీ అన్నారు. తీరా చూస్తే ఏవీ లేవని ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆదివారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఉద్యోగులు ఆందోళన చేస్తున్న సమయంలో మహిళా ఉద్యోగిని పోలీసులు ఈడ్చుకెళ్తున్న ఫొటోను ట్యాగ్ చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

**అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సచివాలయ వ్యవస్థపై కక్ష**

మీరు సీఎం సీట్లోకి వచ్చిన తొలి రోజు నుంచే.. మేం దేశంలో ఎక్కడా లేని విధంగా, పరిపాలనలో విప్లవాత్మక చర్యగా తీసుకొచ్చిన గ్రామ, వార్డు సచివాలయాలపై కక్షగట్టారు. గ్రామ స్థాయిలోనే 540కి పైగా సేవలందించిన, మా మానస పుత్రికలైన గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ నిర్వీర్యమే లక్ష్యంగా.. ఆ వ్యవస్థలపై నిరంతరం దాడి చేస్తూనే ఉన్నారు. గ్రామ స్వరాజ్యం కనబడకుండా చేసేందుకు కుట్రలు పన్నుతూనే ఉన్నారు. ఒకే నోటిఫికేషన్‌తో దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 1.34 లక్షల శాశ్వత



ఉద్యోగాలను, వలంటీర్ల రూపంలో మరో 2.6 లక్షల ఉద్యోగాలను గ్రామ, వార్డు స్థాయిలో పారదర్శక పాలన కోసం మేం సృష్టించాం.

హేతు బద్ధీకరణ పేరుతో మీరు శాశ్వతంగా 30 వేల ఉద్యోగాలకు ఎసరు పెట్టడమే కాకుండా, వలంటీర్లకు మేం ఇచ్చే రూ.5 వేల జీతాన్ని రూ.10 వేలు చేస్తామంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పి, తీరా అధికారంలోకి వచ్చాక వారికీ వెన్నుపోటు పొడిచారు. ఇప్పుడు వలంటీర్లు అందించే సేవలనూ సచివాలయాల ఉద్యోగుల నెత్తిమీద పెట్టి, మోయలేని పని భారాన్ని మోపారు. పారదర్శకతకూ, ఇంటి వద్దకే పాలనకూ తెరదించారు. మీరు పెడుతున్న కష్టాలు, వేధింపులు భరించలేక ఒత్తిడికి గురై కొందరు, బలవన్మరణానికి పాల్పడి మరికొందరు.. ఇలా ఈ రెండున్నరేళ్ల మీ దుర్మార్గ పరిపాలనలో ఏకంగా సుమారు 100 మంది ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారు.

మరి ఇన్ని కష్టాలు పడుతున్నప్పుడు, వారి బాధలు వినాలనే ఉద్దేశం మీకు లేనప్పుడు, వారు శాంతియుత ఆందోళన ద్వారా తమ గొంతు వినిపించాలనుకోవడం తప్పు ఎలా అవుతుంది? ఈ లాఠీఛార్జి ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించడమే కాకుండా, ఉద్యోగులకు క్షమాపణ చెప్పండి. వారిపై విధించిన సస్పెన్షన్లను బేషరతుగా ఎత్తివేయండి' అని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు.

**గ్రామ--వార్డు సచివాలయాల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం**

ఈ సందర్భంగా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు వారి జగనన్నగా నేను హామీ ఇస్తున్నాను. దేవుడి దయ, ప్రజలందరి ఆశీస్సులతో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే గ్రామ-వార్డు సచివాలయాల వ్యవస్థను మునుపటి కంటే మరింత బలోపేతం చేస్తాం. తద్వారా గ్రామ స్వరాజ్యం మూడు పువ్వులు - ఆరుకాయలుగా వర్ధిల్లుతుంది, మాట ఇస్తే, మాటమీద నిలబడే విశ్వసనీయ పాలన మళ్లీ ఉజ్వలిస్తుంది. ఉద్యోగులు తమ బాధ్యతలను గొప్పగా నిర్వర్తించేలా, ప్రజలకు అద్భుతమైన సేవలు మళ్లీ అందేలా, దేశం అంతా మన వైపు చూసేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రెండున్నరేళ్లు అయిపోయింది. ఇక మిగిలింది రెండున్నరేళ్లు మాత్రమే. కళ్లు మూసుకుంటే ఆ కాలం కూడా ఇట్టే గడిచి పోతుంది. మన అందరి ప్రభుత్వం తప్పక వస్తుంది. తప్పకుండా మీకు న్యాయం జరుగుతుంది.

# కమ్యూనిస్ట్ పార్టీలతో జగన్ ములాఖత్

**నెల్లూరు :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత కొద్దిరోజులుగా చోటుచేసుకుంటున్న పరిణామాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జాతీయ రాజకీయ వ్యూహంలో వస్తున్న మార్పులను స్పష్టంగా సూచిస్తున్నాయి. ఓడిపోయాక కూడా జగన్ రెడ్డి విధానాలను, శైలిని అత్యంత తీవ్రస్థాయిలో విమర్శిస్తూ వచ్చిన సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ, అనూహ్యంగా నేరుగా తాడేపల్లిలోని జగన్ నివాసానికి వెళ్లడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. తమ పార్టీ నిర్వహించే సదస్సుకు హాజరు కావాలంటూ జగన్‌ను ఆయన ఆహ్వానించడం కేవలం ఒక సాధారణ మర్యాదపూర్వక భేటీ ఎంతమాత్రమూ కాదు. గతంలో సీపీఐ జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఎన్నో కీలక సదస్సులు, చర్చా కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ, వైఎస్సార్‌సీపీని , జగన్ రెడ్డిని ఏనాడూ భాగస్వామ్యంగా ఆహ్వానించిన దాఖలాలు లేవు. అలాంటిది ఇప్పుడు రాత్రికి రాత్రే సీపీఐ వైఖరిలో ఈ మార్పు రావడానికి వెనుక జాతీయ స్థాయి ఇండియా కూటమి అగ్రనేతల స్పష్టమైన సూచనలు ఉన్నాయనేది బహిరంగ రహస్యం. జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలను ఏకం చేసే క్రమంలో, ఏపీలో వైఎస్సార్‌సీపీని మెల్లగా కాంగ్రెస్ నాయకత్వంలోని కూటమి వైపునకు తిప్పుకునేందుకు కమ్యూనిస్టులను దూతలుగా వాడుకుంటున్నారనే సంకేతాలు కనిపిస్తున్నాయి. మరోవైపు జగన్ రెడ్డి కూడా ఈ పరిణామాలను తన రాజకీయ రక్షణ కవచంగా, వ్యూహాత్మక ఆయుధంగా మలుచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ పెద్దలతో సఖ్యతగా ఉంటూ తనపై ఉన్న కేసులు, ఇతర అంశాల్లో లబ్ధి పొందిన జగన్, ఇప్పుడు రాష్ట్రంలో అధికారం కోల్పోయాక జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ దారులను వెతుక్కుంటున్నారు. కమ్యూనిస్టులతో వేదికలు పంచుకోవడం ద్వారా, అవసరమైతే తాము కాంగ్రెస్‌తో జతకట్టడానికి కూడా సిద్ధమేనన్న సంకేతాలను ఢిల్లీలోని బీజేపీ పెద్దలకు పంపుతూ ఒకరకమైన రాజకీయ బ్లాక్‌మెయిలింగ్ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది.



తమ కేసులు, వ్యవహారాల విషయంలో ఈడీ దూకుడును తగ్గించాలన్నది ఆయన ప్లాన్ కావొచ్చు. సీపీఐ నాయకులను సజ్జల రామకృష్ణారెడ్డి వెంటబెట్టుకుని స్వయంగా జగన్ వద్దకు తీసుకు వచ్చారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ ప్రభుత్వంపై వామపక్షాలు నిరంతరం పోరాటాలు చేయగా, మారిన రాజకీయ సమీకరణాలతో ఇప్పుడు అదే వామపక్ష నేతలను సజ్జల తాడేపల్లి గడప తొక్కించి అధినేతతో ముచ్చటించేలా చేయడం వెనుక ఏదో ఒక ప్రతిపక్ష ఐక్యత వ్యూహం ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక ఆహ్వానం వరకు బాగానే ఉన్నా.. విజయవాడలో జరిగే రౌండ్ టేబుల్ భేటీకి జగన్ స్వయంగా హాజరయ్యే అవకాశాలు లేవు. ఉమ్మడి వేదికలపైకి రావడం గానీ, ఇతర పార్టీలు నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశాలకు స్వయంగా వెళ్లి కూర్చోవడం గానీ జగన్ రాజకీయ శైలిలో ఎన్నడూ కనిపించని వ్యవహారం. సీపీఐ నిర్వహించే ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి వైఎస్సార్‌సీపీ తరఫున ఒక అధికారిక ప్రతినిధి బృందాన్ని పంపిస్తారా అన్నది కూడా క్లారిటీ లేదు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రజా సమస్యలపై అందరితో కలిసి పనిచేయడానికి సానుకూలత వ్యక్తం చేసిన జగన్.. ఏదైనా ఉంటే తమ పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో పాల్గొనాలి కానీ.. తాము వేరే వారి కార్యక్రమాల్లో పాల్గొనడం ఏమిటని అనుకుంటారు. జగన్ రెడ్డి అనుసరిస్తున్న ఈ రాజకీయ విధానం అత్యంత ప్రమాదకరమైన మలుపులకు దారితీసే అవకాశం ఉంది. ఒకవైపు కాంగ్రెస్ పార్టీతో తమకున్న పాత వైరాన్ని, విభజన మచ్చను పక్కనబెట్టి సొంత ప్రయోజనాల కోసం దొడ్డిదారిన పొత్తులకు పావులు కదపడం ద్వారా ఆయన తన సిద్ధాంత రాహిత్యాన్ని బయటపెట్టుకుంటున్నారు. సీపీఐ రామకృష్ణ రాయబారంతో ప్రారంభమైన ఈ ప్రహసనం.. రేపటి రోజున వైఎస్సార్‌సీపీని కాంగ్రెస్ కూటమిలో భాగస్వామిగా నిలబెట్టే దిశగా సాగుతున్న మొదటి అడుగు అనడంలో సందేహం లేదు. బీజేపీపై ఒత్తిడి పెంచడానికి ఒకవైపు కమ్యూనిస్టులను వాడుకుంటూనే, మరోవైపు రాబోయే రోజుల్లో కేంద్రంలో అధికారం మారితే తమ ఉనికిని కాపాడుకోవడానికి జగన్ వేస్తున్న ఈ రాజకీయం ఎలాంటి ఫలితాలను ఇస్తుందో వేచి చూడాలి.

# ఏటీఎంలలో దుర్గమ్మ ప్రసాదం

**విజయవాడ :** రాష్ట్రంలో మొదటిసారిగా దుర్గమ్మ దేవస్థానంలో ప్రసాదం ఏటీఎంను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. భక్తులు ప్రసాదం కౌంటర్ల వద్ద గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే శ్రమ లేకుండా లడ్డూ ప్రసాదాన్ని పొందేందుకు ఈ ఆధునిక సాంకేతికత ఎంతో దోహదపడుతుందన్నారు దేవాదాయశాఖ కమిషనర్ శ్రీ రామచంద్ర మోహన్. ఐఖఎ ద్వారా డిజిటల్ చెల్లింపులు జరిపి క్షణాల్లో ప్రసాదం పొందేలా రూపొందించారు. ప్రస్తుతం ట్రయల్ రన్ గా ఏర్పాటు చేశామని..పనితీరు పరిశీలించిన తర్వాత భక్తుల రద్దీ అధికంగా ఉండే ఇతర ప్రాంతాల్లోనూ మరిన్ని యంత్రాలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తాం అన్నారు. ఉత్సవాల రద్దీ సమయంలోనే కాదు సాధారణ రోజుల్లోనూ సులువుగా లడ్డూ ప్రసాదం పొందొచ్చన్నారు. మరోవైపు ఫేక్ పూజా టికెట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు దేవాదాయశాఖ కమిషనర్ శ్రీ కె. రామచంద్ర మోహన్. దేవాలయ దర్శనాలు, సేవల పేరిట దళారుల ప్రమేయాన్ని ఉపేక్షించేది లేదన్నారు. విజయవాడలో ఇటీవల వెలుగుచూసిన ఫేక్ పూజా టికెట్ల వ్యవహారంపై దేవస్థానం అధికార యంత్రాంగం తక్షణమే అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేసిందని, బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆలయ సేవలను కేవలం ప్రభుత్వం, దేవస్థానం అధికారికంగా ఏర్పాటు చేసిన వెబ్‌సైట్లు, డిజిటల్ యాప్‌లు , అధీకృత కౌంటర్ల ద్వారా మాత్రమే పొందాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని పారదర్శకంగా సేవా టికెట్లు పొందాలని, దళారులను ప్రోత్సహించవద్దన్నార. ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు దేవాదాయశాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. సామాన్య భక్తునికే అగ్రస్థానం కల్పించే దిశగా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. రద్దీ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, ప్రసాద వితరణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎండ, వర్షాల బారిన పడకుండా షెడ్ల నిర్మాణం, నిరంతర పర్యవేక్షణకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా దర్శనం చేసుకుని వెళ్లేలా ప్రణాళికలు రూపొందించామని, ఉత్సవాలను విజయవంతం చేసేందుకు భక్తులందరూ అధికార యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.

## ఏపీ వ్యాప్తంగా హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ దాడులు..



-మొదటిపేజీ తరువాయి

విభాగం డైరెక్టర్ జనరల్ సి. అరుణ్ బాబు పర్యవేక్షణలో ఈ ఆకస్మిక తనిఖీలు జరిగాయి. జాయింట్ ఫుడ్ కంట్రోలర్ బి. శ్రీనివాస్ నేతృత్వంలోని బృందాల్లో 40 మంది ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, 13 మంది అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు పాల్గొన్నారు. నిబంధనలు పాటించని కారణంగా మూసివేసిన వాటిలో అనకాపల్లిలోని ఓ ధాబా, నెల్లూరు జొన్నవాడ రోడ్డులోని మరో ధాబా, నెల్లూరు ట్రంక్ రోడ్డులోని ఓ హోటల్, విశాఖపట్నం ఎంవీపీ కాలనీలోని టిఫిన్ సెంటర్, తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ భోజనశాల ఉన్నాయి. వీటితో పాటు, స్వల్ప ఉల్లంఘనలు గుర్తించిన మరో 45 సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు. వివిధ రకాల నిబంధనల ఉల్లంఘనల కింద మొత్తం 30 కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. మూసివేసిన హోటళ్ల యాజమాన్యాలు ఆహార భద్రతా నిబంధనల ప్రకారం అవసరమైన మార్పులు చేసుకోవాలని, లోపాలను సరిదిద్దుకున్న తర్వాతే తిరిగి తెరుచుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులోనూ ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి తనిఖీలు కొనసాగిస్తామని ఉన్నతాధికారులు హెచ్చరించారు.

## గ్రామీణాభివృద్ధి పథకాలకు పెద్దపీట

-మొదటిపేజీ తరువాయి

అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. సభా ప్రాంగణం, భద్రతా చర్యలు, పార్కింగ్ సౌకర్యాలను నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేశ్ స్వయంగా పర్యవేక్షించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



మరోవైపు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కూటమి నేతలు సమాయత్తమవుతున్నారు. కోవూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, ఉదయగిరి నియోజకవర్గంలోని జనసేన, బీజేపీ నాయకులతో సమావేశమై ప్రజా సమీకరణపై చర్చించినట్లు తెలిపారు. "ప్రభుత్వం చేపడుతున్న ఈ మహత్తర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి. సెప్టెంబరు 29న రామాపురం గ్రామానికి భారీగా తరలివచ్చి 'పల్లె పండుగ 3.0'ను విజయవంతం చేయాలి" అని ఆమె ప్రజలను కోరారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## కూటమి పార్టీల మధ్య సమన్వయం ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

సిద్ధంగా ఉండాలని, గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సమన్వయ కమిటీలను మరింత చురుగ్గా మార్చాలని సూచించారు. స్థానిక సమస్యలు, ప్రజావసరాలపై పూర్తి అవగాహన ఉండి, ప్రజల్లో ఆదరణ కలిగిన అత్యంత అనుకూలమైన అభ్యర్థులను గుర్తించడంపై దృష్టి సారించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. క్షేత్రస్థాయిలోని రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ, అందుకు అనుగుణంగా కార్యాచరణలో మార్పులు చేసుకోవాలని నేతలకు సూచించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకత్వం, కార్యకర్తల మధ్య నిరంతర సమాచార మార్పిడి ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతను చాటాలని, సమష్టి కృషితో ఘన విజయం సాధించాలని పల్లా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విశాఖపట్నం జిల్లా పార్లమెంట్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ఎం.ఏ. షరీఫ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, మూడు పార్టీల ముఖ్య నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్వర్ణ గ్రామ, వార్డు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సర్కార్ చర్యలు

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడేలా నోషనల్ ఇంక్రిమెంట్లు, పదోన్నతులు, సెలవులు, కారుణ్య నియామకాలపై వేగంగా అడుగులు వేస్తోంది. సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ సానుకూల నిర్ణయాలు తీసుకుంటోంది. స్వర్ణ వార్డుల్లో పనిచేస్తున్న నాలుగు కేటగిరీల ఉద్యోగుల పదోన్నతులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ప్రమోషన్ ఛానళ్లపై జీవో 244ను జారీ చేసింది. ఖాళీలను క్రమబద్ధీకరించి కొత్తగా 815 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను ఏర్పాటు చేసింది. వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు పదోన్నతులు కల్పిస్తామని, ఆ ఖాళీలను వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలతో భర్తీ చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీల 815 పోస్టులను గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1కు అప్‌గ్రేడ్ చేశారు. దీనివల్ల రెండు కేటగిరీల్లో 1,630 మందికి ప్రమోషన్లు రానున్నాయి. మిగిలిన రెండు కేటగిరీల ఉద్యోగుల పదోన్నతులపై కమిటీ సిఫార్సులు రాగానే నిబంధనలు జారీ చేస్తామన్నారు. ఆరేళ్ల పాటు ఒకే పోస్టులో పనిచేసిన 1.14 లక్షల మంది ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్‌ను అమలు చేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వంపై రూ.150 కోట్ల అదనపు భారం పడుతోంది. నోషనల్ ఇంక్రిమెంట్లపై ఆర్థిక శాఖ నివేదిక అందిన వెంటనే తుది నిర్ణయం తీసుకోనున్నారు. వీటి వల్ల సుమారు రూ.2,500 కోట్ల భారం పడుతుందని అంచనా వేశారు. శాఖలోని 18 కేడర్లకు ప్రమోషన్ ఛానళ్లు ఏర్పాటు చేసి ఇప్పటికే 14,331 మందికి పదోన్నతులు కల్పించారు. ఏఎన్‌ఎంలు, ఎనర్జీ, వెల్ఫేర్, ఇంజినీరింగ్, వ్యవసాయ, ఉద్యాన తదితర అసిస్టెంట్లకు మాతృశాఖల్లో ప్రమోషన్లు ఇచ్చారు.

**కారుణ్య నియామకాలు**

ఉద్యోగుల పని ఒత్తిడిని తగ్గించేందుకు జిల్లా స్థాయిలో కమిటీలు, గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో విధులు కేటాయించవద్దని అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఆటోమేటిక్ క్యాజువల్ లీవ్‌లకు ఆమోదం తెలుపుతూ, అర్హత మేరకు ఆర్జిత సెలవులు అమలు చేస్తున్నారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా స్వర్ణ సిబ్బందికి మరణ ప్రయోజనాలు అందిస్తున్నారు. ఇప్పటికే అర్హులైన 121 మందికి కారుణ్య నియామకాలు కల్పించారు.

# సబ్బవరంలో నూతన అగ్నిమాపక కేంద్రం ప్రారంభం.





**ప్రజల భద్రతకు ఫైర్ సిబ్బంది అంకిత భావంతో సేవలందిస్తున్నారు హోంమంత్రి.**

**సబ్బవరం, పెన్ సత్తా, సెప్టెంబర్ 27:** అనకాపల్లి జిల్లాలో హోంమంత్రి వంగలపూడి అనిత ఆదివారం పర్యటించారు. సబ్బవరంలో రూ.1.60 కోట్ల వ్యయంతో 15 వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన నూతన అగ్నిమాపక కేంద్ర భవనాన్ని హోం మంత్రి అనిత, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, ఏపీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్రం లోని వివిధ గదులను హోంమంత్రి పరిశీలించారు. నూతన అగ్నిమాపక వాహనాన్ని ప్రారంభించారు. ఫైర్ డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించి, వివిధ అగ్నిమాపక పరికరాల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అగ్నిమాపక కేంద్రం ప్రాంగణంలో హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, ఏపీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ సబ్బవరం తన సొంతూరు కావడంతో ఇక్కడికి రావడం ఎంతో ఆనందంగా ఉంటుందని అన్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది అద్భుతంగా పనిచేస్తున్నారని అభినందించారు. విపత్తులు సంభవించినప్పుడు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఫైర్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. బుడమేరు వరదల సమయంలో ఫైర్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాలను శుభ్రం చేయడంలో కీలకంగా సేవలందించారని గుర్తు చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ హయాంలో అనేక నూతన అగ్నిమాపక కేంద్రాలను నిర్మించడంతో పాటు పెద్ద సంఖ్యలో అగ్నిమాపక వాహనాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. పెందుర్తి నియోజకవర్గం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు తమ సత్తా చాటాలని ఆమె పిలుపునిచ్చారు.





# బీజేపీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు మాధవ్.

**ఓటు చోరీ పేరుతో ప్రతిపక్షాలు నిరాధార విమర్శలు.**

**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 27:** విశాఖ లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షులు పరుశురామరాజు అధ్యక్షతన నిర్వహించిన పత్రికా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పివిఎన్ మాధవ్. సమావేశంలో మాధవ్ మాట్లాడుతూ ఓటు చోరీ పేరుతో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల పై ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ఎన్ మాధవ్ తీవ్రంగా స్పందించారు. ప్రజల్లో బీజేపీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు, కొన్ని వామపక్షాలు, మేధావుల పేరుతో మాట్లాడుతున్న వర్గాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని ఆయన విమర్శించారు. నరేంద్ర మోదీ పై చేస్తున్న ప్రతి ఆరోపణకు ప్రజాస్వామ్యబద్ధంగా సమాధానం చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన పూర్తి ప్రెస్‌నోట్‌ను ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు. రాహుల్ గాంధీ తో పాటు సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలను తప్పుబట్టారు. అసత్య ప్రచారాలతో ప్రజలను పక్కదారి పట్టించవద్దని




హెచ్చరించారు. ప్రతిపక్షాలకు నిజంగా ప్రజల్లో బలం ఉంటే... తమ పార్టీలను బలోపేతం చేసుకుని ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని సూచించారు. ఓటు చోరీ ఆరోపణల పై స్పందిస్తూ... దేశంలో ఓటర్ల జాబితా తయారీ, సవరణకు పటిష్టమైన వ్యవస్థ ఉందని మాధవ్ వివరించారు. సీఈఓ, ఈఆర్ఓ, డిప్యూటీ ఈఆర్ఓలతో పాటు బూత్ లెవల్ అధికారులు పనిచేస్తున్నారని, వివిధ ఫార్మ్‌ల ద్వారా ఓటర్ల జాబితా సవరణ జరుగుతుందని తెలిపారు. క్రమం తప్పకుండా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇంత పెద్ద వ్యవస్థలో కొన్ని పొరపాట్లు జరిగే అవకాశం ఉన్నప్పటికీ, దానిని 'ఓటు చోరీ'గా అభివర్ణించడం సత్యదూరమని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కూడా పారదర్శకంగా జరుగుతుందని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందని తెలిపారు. గతంలో బీజేపీకి కొన్ని రాష్ట్రాల్లో పరాజయాలు ఎదురైన విషయాన్ని కూడా ప్రస్తావిస్తూ ప్రజల తీర్పును పార్టీ గౌరవిస్తుందని చెప్పారు. బీజేపీ బలానికి ప్రధాన కారణం పార్టీ సంస్థాగత నిర్మాణమేనని, బూత్ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు పార్టీ వ్యవస్థ పనిచేస్తుందని, కార్యకర్తలకు నిర్దిష్ట కార్యక్రమాలు అప్పగించి వాటి అమలును పర్యవేక్షిస్తామని తెలిపారు. ప్రజలను తప్పుదారి పట్టించేలా తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని ప్రతిపక్షాలకు మాధవ్ హెచ్చరించారు. నిజంగా ప్రతిపక్షాలకు ప్రజల్లో బలం ఉంటే ప్రజాక్షేత్రంలో తమ రాజకీయ ఆలోచనలను ప్రజల ముందుంచి ఎన్నికల్లో పోటీ చేసి మద్దతు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి యు. సుజాత, రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, మీడియా ప్యానలిస్టులు కే ఎన్ పీ చక్రవర్తి, కరణం రెడ్డి నర్సింగ రావు, ఎంఎస్ఎమ్ఈ డైరెక్టర్ విజయనందరెడ్డి పాల్గొన్నారు.

# క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి.. పీజీఆర్ఎస్ అర్జీ పరిష్కారం పై స్పందన తెలపండి

**జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్.**

**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 27:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి అమలు చేస్తున్న పీజీఆర్ఎస్ సేవల్లో క్యూ ఆర్ కోడ్ విధానం అందుబాటు లోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాల వద్ద, స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుల వద్ద అందుబాటులో ఉన్న క్యూఆర్ కోడ్ ను ప్రజలు తమ మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేసి, అర్జీ పరిష్కారం పై నేరుగా ఫీడ్‌బ్యాక్ నమోదు చేయవచ్చని పేర్కొన్నారు. అందిన ఫీడ్‌బ్యాక్‌ను ఉన్నతాధికారులు సమీక్షించి, పరిష్కారం నాణ్యతను పరిశీలిస్తారన్నారు. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని తమ అభిప్రాయాలను నమోదు చేయాలని కలెక్టర్ ఓ ప్రకటన ద్వారా కోరారు.



## బొండా జగన్ కు సామాజిక వర్గాల వెన్నుదన్ను.

**99 వ వార్డు జగన్ కు కేటాయించాలని ఎమ్మెల్యే పల్లాకు వినతి.**



**గాజువాక, పెన్ సత్తా, సెప్టెంబర్ 27:** రానున్న గ్రేటర్ ఎన్నికల్లో 99 వ వార్డు నుంచి మాజీ కార్పొరేటర్ బొండా జగన్నాధం(జగన్)కే అవకాశం కల్పించాలని వార్డుకి చెందిన అనేక సామాజిక వర్గాల నేతలు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు జగన్ ఆధ్వర్యంలో ఆయా సామాజిక వర్గాల ప్రతినిధులు వడ్లపూడి నుంచి ర్యాలీగా బయలుదేరి పాత గాజువాక తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లాను కలిశారు. టీడీపీ అంటే ఎనలేని అభిమానం, గౌరవం కలిగిన జగన్ కు మరోసారి పార్టీ టికెట్ కేటాయించాలని కోరారు. ఐదేళ్ల పదవీ కాలంలో ఎనలేని అభివృద్ధి చేసారని, అందులోనూ కూటమి అధికారం లోకి వచ్చాక శాసన సభ్యులు పల్లా శ్రీనివాస రావు ప్రోత్సాహంతో వార్డులో ప్రధానగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ (నాలుగు ఎకరాల యాభై సెంట్లు లో గ్రౌండ్), ప్రధాన గెడ్డ, వడ్లపూడి నుండి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు ఇరువైపులా ఫుట్ పాత్, బి.టి రోడ్డు, స్మశానంను ఒక పార్క్ లాగా అభివృద్ధి, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. వార్డుని అభివృద్ధి చేయాలన్న, అక్కడి సామాజిక వర్గాలకు అన్ని విధాలా న్యాయం జరగాలన్నా అది జగన్ తోనే సాధ్యమని, ఆయన వెంట అంతా సమిష్టిగా ఉంటూ పార్టీ బలోపేతానికి ఎన్నికల్లో విజయానికి పూర్తిగా సహకారాన్ని అందిస్తామని తెలిపారు. వినతిని పరిశీలించి 99 వ వార్డు నుంచి పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు విజయరామరాజు, సెక్రెటరీ బొట్టా ప్రకాష్, ప్రగడ దానయ్య, కాండ్రేగుల శ్రీనివాస నాయుడు, పావాడ వెంకటరమణమూర్తి, పి. పెంటయ్య, వడ్లపూడి గ్రామ పెద్దలు కన్నం రెడ్డి తాత నాయుడు, మింది గోవింద ద్రోణాద్రి అప్పలనాడు, వై భాస్కర్ రావు, గెద్దాడ రాంబాబు, బొండా పైడిరాజు మైసర్ల సత్యనారాయణ, ఈర్ల దేముడు, దుగ్గపు రాజేంద్రప్రసాద్, పోతల కృష్ణ, బొడ్డా ప్రకాష్, శ్రీరామ్ మూర్తి, గండిమాన కనకరాజు, మైసర్ల సత్యనారాయణ, కోరుకొండ చంటి, కాదా సూరిబాబు, దాలయ్య, శ్రీనివాసరావు, రుక్మిణి, వర్రె అప్పారావు, కర్రి నాగరాజు, జాన్ రమేష్, సారిపల్లి అరుణ్ కిరణ్, కోరుకొండ కళ్యాణ్ చక్రవర్తి, తుట్టా పైడిరాజు, వై. నాగేశ్వర రావు, సన్యాసిరావు, ఆదినారాయణ, సుందర్ సునీల్, నీటికాయల సన్యాసిరావు, సూర్యనారాయణ, మింది రాజు, మింది పేరయ్య,పోలరాజు, వీసీఎస్ రాంబాబు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కనకదుర్గ పందిరిరాట మహోత్సవం.





**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 27**: గవరపాలెంలో శతకం పట్టు కొలువైన కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం దుర్గా దేవి శరన్నవరాత్రిలు సందర్భంగా ఆలయ అర్చకులు కే హరినారాయణ ఆధ్వర్యంలో ఆలయం వద్ద పందిరిరాట మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ రాట పూజలో పి.వెంకట అప్పారావు, వాణి దంపతులు, బుద్ధ సంతోష్, హేమ దంపతులు, ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ శాశ్వత చైర్మన్, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ప్రస్తుత ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరాహ నూకరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది వలే ఈ ఏడాది కూడా దేవీ నవరాత్రులు అత్యంత ఘనంగా నిర్వహిస్తామని వారు తెలియజేశారు. అనంతరం నూతన ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలు దాడి జయవీర్, కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, కర్రి సన్యాసి నాయుడు, భీమర శెట్టి వరాహ నూకరాజు పాల్గొన్నారు. నూతన ఉత్సవ కమిటీ చైర్మన్ గా కొణతాల మురళీకృష్ణ, నూతనడైరెక్టర్లుగా సూరిశెట్టి శ్రీను, దూల ప్రసాదు, కాండ్రేగుల బుజ్జి, సూరిశెట్టి గణేష్, పెంటకోట మధు,విల్లూరి ఫణి, యాళ్ల శ్రీనివాసరావు, దాడి నాగభూషణం, కొయిలాడ నాగ గణేష్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో, గౌరీ పరమేశ్వరి కమిటీ సభ్యులు, ప్రజా టెంట్ హౌస్, మరిడిమాంబ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## స్టేషన్లలో 100% సురక్షిత తాగునీరు: దక్షిణ తీర రైల్వే




**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 27:**దక్షిణ తీర రైల్వే పరిధిలోని రైల్వే స్టేషన్లు, కాలనీలు, ఆసుపత్రులు, శిక్షణా సంస్థలు, పాఠశాలల్లో ప్రయాణికులు, సిబ్బందికి సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ మార్గదర్శకత్వంలో వైద్య, పర్యావరణ ఆరోగ్య, ఇంజనీరింగ్ విభాగాలు నిరంతరం నీటి నాణ్యతను పరీక్షిస్తున్నాయి. ఆగస్టు 18 నుంచి సెప్టెంబర్ 24 వరకు 195 స్టేషన్లలో 12,790 అవశేష క్లోరిన్ నమూనాలను పరీక్షించగా, అన్ని నమూనాలు ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు వెల్లడించారు. 1,051 బ్యాక్టీరియాలజికల్ పరీక్షల్లోనూ 100 శాతం భద్రత నమోదైంది. అలాగే 68 రైల్వే కాలనీల్లో క్లోరిన్ పరీక్షలు, 29 కాలనీలు, వైద్య విభాగాల్లో బ్యాక్టీరియాలజికల్ పరీక్షలు నిర్వహించి సంతృప్తికర ఫలితాలు సాధించినట్లు తెలిపారు. జనరల్ మేనేజర్ క్షేత్రస్థాయి పర్యటనల్లో నీటి నాణ్యతను స్వయంగా పరిశీలిస్తూ ప్రయాణికులు, కాలనీ వాసుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నారని అధికారులు పేర్కొన్నారు.

## సోమవారం జివిఎంసిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 27:**జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు పునర్వ్యవస్థీకరించిన 10 జోన్ల కార్యాలయాల్లో సెప్టెంబర్ 28 సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. పారిశుద్ధ్యం, నీటి సరఫరా, వీధి దీపాలు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, రెవెన్యూ, ఉద్యానవనాలు తదితర విభాగాలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు. వెస్ట్ జోన్ కార్యాలయం ఎన్ఏడీ కొత్త రోడ్డు గౌరీనగర్‌లో, నార్త్ జోన్ కార్యాలయం మాధవధార ఉడా లేఅవుట్‌లో, అగనంపూడి జోన్ కార్యాలయం పెదమడకలోని రాజీవ్ గాంధీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసినట్లు జీవీఎంసీ అధికారులు వెల్లడించారు.

## విశాఖ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతపై అవగాహన




**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 27::**విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతా హి సేవా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రన్నింగ్ రూమ్ సిబ్బంది, ఆహార విక్రేతలు, ప్రయాణికులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సహాయ డివిజనల్ రైల్వే మేనేజర్ కె. రామారావు, డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ గౌరవ్, డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ సంచయ్ పాల్గొని వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షిత ఆహార నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై సూచనలు చేశారు. చెత్తను ఏర్పాటు చేసిన చెత్తబుట్టల్లోనే వేయాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. పరిశుభ్రతను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## భారీ వర్షాలకు ఇల్లు కూలిన నిరుపేద కుటుంబానికి రూ.లక్ష సాయం



**మధురవాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 27:**ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మధురవాడ 5వ వార్డు కొమ్మాది జంక్షన్ కార్పెంటర్ కాలనీలో మెట్ట రాము, కాంచన దంపతుల రేకుల షెడ్డు కూలిపోయింది. ప్రమాద సమయంలో ఇంట్లో దంపతులతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికీ అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు కాలేదు. ఇల్లు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న కుటుంబాన్ని కళింగ సామాజిక వర్గ నాయకులు ఆదివారం పరామర్శించి రూ. 1 లక్ష నగదు ఆర్థిక సాయం అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ రొనంకి కృష్ణం నాయుడు, డైరెక్టర్ మామిడి దుర్గారావు, బగాధి లక్ష్మణ, కూన రమణ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ఐక్యతతో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం కొణతాల.





### బూత్ స్థాయి నుంచే పకడ్బందీ వ్యూహంతో ముందుకు సాగాలి.

**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 27:**రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులతో, కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వంచారు. ఈ సమావేశంలో
మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ నాయకులు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో, ఐక్యతతో ఎన్నికలకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనకాపల్లి గవరపాలెం సత్య ఏసీ ఫంక్షన్ హాల్ నందు శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అధ్యక్షతన కూటమి కుటుంబ సభ్యుల పార్టీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు, ఏపీయుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, తెలుగుదేశం జిల్లా అధ్యక్షులు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, డి సి ఎం ఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, ఇతర నాయకులు, పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల పై నిర్వహించిన సమావేశంలో కొణతాల మాట్లాడారు. కూటమి మూడు పార్టీలు పేరుకే వేర్వేరు పార్టీలైనా, ఎన్నికల సమయంలో ఒక కుటుంబంలా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అధిష్టానం ఏ పార్టీకి, ఏ అభ్యర్థికి అవకాశం కల్పించినా వ్యక్తిగత అభిప్రాయాలు, ఆశలు పక్కన పెట్టి కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అభ్యర్థులు ఎవరు, ఏ పార్టీకి ఎన్ని స్థానాలు అనే అంశాల పై ముందస్తు ఊహాగానాలకు తావివ్వకుండా పార్టీ అధిష్టానం నిర్ణయాన్ని గౌరవించాలని కొణతాల తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కొణతాల సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత లభిస్తోందన్నారు. పోలవరం, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్, పరిశ్రమలు, గ్రీన్ హైడ్రోజన్, డేటా సెంటర్లు వంటి పలు కీలక అంశాలను ఆయన ప్రస్తావించారు.
స్థానిక సంస్థలే రాజకీయాలకు బలమైన పునాది అని కొణతాల తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు గెలవడం మాత్రమే కాకుండా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కూటమి సంస్థాగతంగా బలపడాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, కార్పొరేటర్, మేయర్ తదితర స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. ప్రతి వార్డులో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసి వార్డు స్థాయి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి బూత్ కు సంబంధించిన కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లు, క్రియాశీలక సభ్యుల వివరాలను సిద్ధం చేసుకోవాలని అన్నారు. మారిన వార్డు పరిధులు, పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా బూత్ కమిటీలను పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ జాబితా పరిశీలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. జనవరి 2026 లో తుది రూపం పొందిన ఓటర్ జాబితాను ఆధారంగా చేసుకుని ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాలని తెలిపారు. ఇప్పటి నుంచే బూత్ స్థాయి కార్యాచరణ ప్రారంభిస్తే నోటిఫికేషన్ వెలువడే సమయానికి కూటమి ఎన్నికల యంత్రాంగం సిద్ధంగా ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు ఖరారైన తర్వాత ప్రచారానికి లభించే సమయం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ముందస్తు క్షేత్రస్థాయి పని ఎంతో కీలకమన్నారు.
ఎవరు అభ్యర్థి అన్నది తర్వాతి విషయం, కూటమి గెలుపే మనందరి ప్రధాన లక్ష్యం అన్నారు. ఒకే మాట, ఒకే బాటతో బూత్ స్థాయి నుంచి పనిచేస్తే స్థానిక సంస్థల్లో బలమైన పునాది నిర్మించగలం అని కొణతాల రామకృష్ణ స్పష్టం చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా పరస్పర సమన్వయంతో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికలకు సమష్టిగా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో అనకాపల్లి నియోజకవర్గం పరిధి కూటమి నాయకులు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక.



**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 27:**పెద్దిరాజుపేట ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ స్కూల్ (కొండ మాస్టర్ బడి) 1990.91 బ్యాచ్ ఆదివారం రోటరీ కళ్యాణ మండపంలో ఆత్మీ కలయిక ఘనంగా జరిగింది. నేటికీ 37 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భముగా పూర్వ విద్యార్థులు తమ చదువుకున్న హైస్కూల్లో ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ తాము చదువుకున్న స్కూలు పాత జ్ఞాపకాలను నెరవేసుకుంటూ ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. తమకు చదువు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. తమతో పాటు చదువుకున్న వారి వివిధ శాఖల ఉద్యోగాల్లో, వ్యాపారవేత్తలుగా, ఉన్నత పదవుల్లో ఉండడం పట్ల ఒకరికొకరు పరిచయం చేసుకుంటూ తమ కుటుంబ సభ్యుల వివరాలను తెలియ పరుచుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో
ఎ కసన్నా, ఎస్ చంద్రశేఖర్, ఏ రాజేష్, ఆర్ తుకారం, ఎల్ రామకృష్ణ, పి దయ భాస్కర్, షేక్ రఫీ, పూర్వపు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భూ సేకరణలో నిర్వాసితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



### ఆడ పిల్లలకు ప్యాకేజీ ఇవ్వాలి
### నిర్వాసితుల కాలనీ లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 27:** భూ సేకరణలో నిర్వాసితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. నక్కపల్లి మండలం, పెద్ద బోదుగల్లం వద్ద నిర్మిస్తున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ నిర్వాసిత కాలనీ లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్ నిర్వాసితులతో కలిసి ఆదివారం కాలనీ లో పర్యటించి, నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత కలిగిన నిర్వాసితులకు, వివాహం అయిన ఆడ పిల్లలకు వెంటనే ప్యాకేజీ ఇవ్వాలని అన్నారు. ఇళ్ళు భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఆర్ కార్డులు ఇచ్చి ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ లో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న పనులలో నిర్వాసితులకు చదువు, వయసు తో సంబంధం లేకుండా వారు చేయగలిగే పనులు కల్పించాలని కోరారు. ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఆర్ అండ్ ఆర్ కాలనీ ని దత్తత్ తీసుకుని కాలనీ మౌలిక సదుపాయాలు కల్పించాలని తక్షణం రక్షిత మంచినీరు కొరకు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఉచితం మంచి నీరు అందించాలని కోరారు. నిర్వాసితుల స్వంత గ్రామాల నుండి ఆగమేఘాల మీద తరలించారని, నిర్వాసితులు సంస్కృతి, సంప్రదాయాలు, మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా చేసారని దీని కారణంగా అనేక అనార్ధాలు జరుగుతున్నాయని, తొలగించిన గ్రామాలలో ఉండే దేవాలయాలు, గుడులు నిర్వాసితుల కాలనీ లో నిర్మిస్తామని చెప్పిన అధికారులు నేడు పట్టించుకోవడంలేదని, దాని కారణంగా మేము ప్రశాంత జీవితం కోల్పోయి ఏ రోజు ఏం జరిగితుందో అని బిక్కు బిక్కు మని జీవిస్తున్నామని నిర్వాసితులు నాయకులు దగ్గర ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.అప్పారావు, బి.నూకరాజు, క్రృష్ణారావు, దుర్గ, జీ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# బోయింగ్ విమానాల్లో సాఫ్ట్ వేర్ లోపాలు

ప్రముఖ విమాన తయారీ సంస్థ బోయింగ్ తమ 737 మ్యాక్స్ విమానాల్లో మరో సాఫ్ట్‌వేర్ లోపాన్ని గుర్తించింది. దీని ప్రభావం భారత్‌లో ఆకాశ ఎయిర్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు నడుపుతున్న సుమారు 96 విమానాలపై పడనుంది. ల్యాండింగ్ సమయంలో ఒకసారి విఫలమై, రెండోసారి వేరే మార్గంలో ప్రయత్నించే క్రమంలో (మిస్డ్ ల్యాండింగ్ అప్రోచ్) ఆటోమేటెడ్ ఫ్లైట్ గైడెన్స్ సిస్టమ్ పనిచేయడం ఆగిపోయే అవకాశం ఉందని బోయింగ్ వెల్లడించింది. పీటీఐ తన కథనంలో పేర్కొన్న వివరాల ప్రకారం, ఈ సమస్యపై బోయింగ్ గత నెలలోనే అన్ని 737 ఆపరేటర్లను అప్రమత్తం చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో పైలట్లు ఆటోమేషన్ తగ్గిపోవడాన్ని గమనించవచ్చని, దీన్ని సురక్షితంగా ఎలా ఎదుర్కోవాలో ఇప్పటికే ఉన్న విధానాలను బలోపేతం చేస్తూ మార్గదర్శకాలను పంచుకున్నట్లు తెలిపింది.



తాత్కాలిక నివారణ చర్యగా, 'మిస్డ్ అప్రోచ్' తర్వాత సిస్టమ్‌ను రీసెట్ చేయాలని ఆపరేటర్లకు సూచించింది. శాశ్వత పరిష్కారం కోసం తమ ఇంజనీర్లు ఒక సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌ను అభివృద్ధి చేస్తున్నారని బోయింగ్ ప్రతినిధి ఒకరు ధృవీకరించారు. భారత్‌లో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వద్ద సుమారు 53, ఆకాశ ఎయిర్ వద్ద 43 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలు ఉన్నాయి. ఈ సమస్యపై ఆకాశ ఎయిర్ స్పందిస్తూ.. తమ విమానాల భద్రతకు ఎలాంటి ముప్పు లేదని, నిర్దేశిత విధానాలు, నియంత్రణ సంస్థల నిబంధనల ప్రకారమే సర్వీసులు కొనసాగుతున్నాయని స్పష్టం చేసింది.

ప్రపంచవ్యాప్తంగా బోయింగ్ 2,400కు పైగా 737 మ్యాక్స్ విమానాలను డెలివరీ చేసింది. మరోవైపు, ఎయిర్‌బస్ సంస్థకు చెందిన కొన్ని ఏ321నియో విమానాల ఫ్యూసిలేజ్‌పై సర్ఫేస్ ప్రొటెక్షన్ కోటింగ్‌కు సంబంధించి నాణ్యతా లోపాన్ని గుర్తించినట్లు కూడా ఈ నివేదికలో పేర్కొన్నారు. భారత్‌లో ఇండిగో సంస్థ నడుపుతున్న సుమారు డజను విమానాల్లో ఈ సమస్య ఉన్నట్టు తెలుస్తోంది.

# ఉగ్రవాదంపై భారత్ ఉక్కుపాదం

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతామని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తోందని తెలిపారు. ఉగ్రవాదానికి బలమైన, నిర్ణయాత్మక ప్రతిస్పందన ఉంటుందనే విషయాన్ని భారత్ స్పష్టం చేసిందని తెలిపారు. 2016 పాకిస్థాన్‌లో ఉగ్రశిబిరాలపై భారత సైన్యం జరిపిన సర్జికల్ స్ట్రైక్స్ అందుకు నిదర్శనమని అని అన్నారు. గాంధీ జయంతి వేళ స్వచ్ఛతకు సంబంధించి ఆయన ఇచ్చిన నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని మోదీ, ప్రజలను కోరారు. 138వ 'మన్ కీ బాత్'లో భాగంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ మేరకు మాట్లాడారు. భారత సైనికులు నియంత్రణ రేఖ దాటి ఉగ్రవాద స్థావరాలపై చర్యలు చేపట్టడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైందని మోదీ అన్నారు. దేశం చాలా కాలంగా ఉగ్రదాడుల వల్ల ఎదుర్కొన్న బాధకు ఈ చర్య నిర్ణయాత్మక ప్రతిస్పందనగా నిలిచిందని పేర్కొన్నారు. పదేళ్ల క్రితం 2016లో చేపట్టిన సర్జికల్ స్ట్రైక్స్ ప్రపంచం ముందు భారత్ ఉగ్రవాద వ్యతిరేక విధానానికి ఒక కొత్త ఉదాహరణగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. 2016 సెప్టెంబర్ 18న జమ్మూకశ్మీర్‌లోని ఉరీలో ఆర్మీ శిబిరంపై ఉగ్రదాడి జరిగింది. ఈ దాడికి ప్రతిస్పందనగా సెప్టెంబర్ 28-29 రాత్రి నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదుల లాంచ్ ప్యాడ్‌లపై భారత సైన్యం సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించింది.



**జనగణనపై ప్రజలకు పిలుపు**

'మన్ కీ బాత్'లో దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణన ప్రక్రియను కూడా ప్రధాని ప్రస్తావించారు. జనగణనను జాతీయ బాధ్యతగా అభివర్ణించారు. ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని కోరారు. జనగణన సమయంలో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ విధానాన్ని కూడా ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. దేశ జనాభా, సామాజిక-ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన సమాచార సేకరణలో పౌరుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

**డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత**

దేశంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు యువత ముందుకు రావడాన్ని ప్రధాని ప్రశంసించారు. 'నషా ముక్త్ యువ అభియాన్' ద్వారా యువత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తోందన్నారు. యువత తమంతట తామే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయడంతో పాటు, ఇతరులను కూడా ఆ దిశగా ప్రోత్సహిస్తున్నారని మోదీ చెప్పారు. 'నషా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో దేశవ్యాప్తంగా యువత భాగస్వామ్యం పెరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల వెల్లడించింది.

**మోధేరా గ్రామం ప్రస్తావన**

గుజరాత్‌లోని చారిత్రాత్మక మోధేరా సూర్య దేవాలయం వెయ్యేళ్ల ప్రస్థానాన్ని ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. విదేశీ దండయాత్రల సమయంలో ఈ ఆలయం ఎదుర్కొన్న విధ్వంసాన్ని, ఆ తర్వాత జరిగిన పునర్నిర్మాణాన్ని గుర్తుచేసుకున్నారు. అదే సమయంలో, ఈ గ్రామం దేశంలోనే మొట్టమొదటి 24ఇ7 సోలార్ విలేజ్?గా మారడాన్ని ఆయన అభినందించారు. అలాగే మోధేరాలో పర్యాటకుల కోసం అనేక వసతులను పెంచినట్లు ప్రధాని తెలిపారు. ఏటా జనవరిలో మకర సంక్రాంతి తర్వాత ఇక్కడ జరిగే 'మోధేరా నృత్య ఉత్సవం'లో భారతీయ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. భారతీయులందరూ జీవితంలో ఒక్కసారైనా మోధేరాను సందర్శించాలని ఆయన కోరారు. మధ్యప్రదేశ్‌లో ఓ యువకుడు నది పరిశుభ్రత చేపడితే సమాజం మొత్తం అండగా నిలిచిందని ప్రధాని మోదీ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పురాతన బావులు, కోనేరులకు పునర్ వైభవం తీసుకొచ్చే దిశగా పరిశుభ్రత కార్యక్రమాలు జరుగుతున్నాయని వెల్లడించారు. దిల్లీలో యువత పొడి, తడి చెత్తను వేర్వేరుగా సేకరించే కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. జనగణన కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకొని ప్రతి పౌరుడు అందులో పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు.

**అశోక్ సింఘాల్‌కు నివాళి**

విశ్వ హిందూ పరిషత్ మాజీ నేత అశోక్ సింఘాల్ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఆయనను స్మరించుకున్నారు. సమాజంలో ఉంటూనే సన్యాసిలా జీవితం గడిపారని పేర్కొన్నారు. రామజన్మభూమి ఉద్యమానికి సింఘాల్ అందించిన దిశ, అందులో ఆయన నింపిన శక్తిని మోదీ ప్రస్తావించారు. అయోధ్యలో నిర్మితమైన రామ మందిరాన్ని

# అల్లకల్లోలంగా సముద్రం.. అప్పుడే స్విమ్మింగ్ చేయడం నాకిష్టం

"సముద్రం అల్లకల్లోలంగా ఉన్నప్పుడు అందులో ఈదడం నాకు చాలా ఇష్టం. ఎందుకంటే అల్లకల్లోలం కూడా ఒక రకమైన ప్రశాంతతేనని అది మనకు నేర్పుతుంది" అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే, ఆయన ఆ వ్యాఖ్యలను ఏ ఉద్దేశంతో చేశారనేది స్పష్టంగా పేర్కొనలేదు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించిన సమస్యలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి, పదేపదే ప్రశ్నలు లేవనెత్తారన్న అంశంపై రాజకీయ దుమారం మధ్య ఈ పోస్ట్ వెలువడింది.



**సీఈసీ తన పదవికి రాజీనామా చేయాలి!**

మరోవైపు, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కేరళ మాజీ ప్రధాన కార్యదర్శికి బీజేపీ టికెట్ ఆఫర్ చేశారన్న వార్తలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన సీఈసీ అధికార పార్టీకి అనుకూలంగా పనిచేయటం దారుణమన్నారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ప్రియాంక డిమాండ్ చేశారు. "ఇది పూర్తిగా చట్టవిరుద్ధం, పూర్తిగా అనైతికం. మన ఎన్నికల వ్యవస్థలో, ఎన్నికలను నిర్వహించే సంస్థల్లో అత్యున్నత స్థాయిలో ఉన్న ఈ వ్యక్తులకు పార్టీల పట్ల పక్షపాతం ఉందని ఇది స్పష్టంగా చూపిస్తోంది. వారికి పార్టీ పక్షపాతం ఉండటమే కాకుండా, ఆయా పార్టీల కోసం వారు క్రియాశీలకంగా ప్రచారం కూడా చేస్తున్నారు. అలాంటప్పుడు వారు నిష్పక్షపాతంగా ఎన్నికలను ఎలా నిర్వహించగలరు? ఈ పెద్దమనిషి చేసిన పూర్తిగా చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన పనుల పరంపరలో ఇది ఒకటి మాత్రమే. కాబట్టి వెంటనే ఆయన తన పదవికి రాజీనామా చేయాలి. దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయి. దిల్లీతో పాటు ప్రతి జిల్లాలో మేం ఆయనకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపాం."

**సీఈసీ ఏకపక్షంగా వ్యవహరించారు!**

మరోవైపు, ఎస్ఐఆర్ విషయంలో జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించిన రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్, ఆయనను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. గత పది నెలలుగా ఇతర ఎన్నికల కమిషనర్ల ప్రమేయం లేకుండా, సీఈసీ ఏకపక్షంగా వ్యవహరించారని మండిపడ్డారు. స్థానిక అధికారులను పక్కనపెట్టి దిల్లీలోని జు.జ.× చీజు ద్వారానే ఓటర్ల చేర్పులు, తొలగింపులు చేపట్టారని, ప్రభుత్వ నోటిఫికేషన్ లేకుండానే ఫారమ్-6లో మార్పులు చేశారని ఆయన విమర్శించారు. కొత్త చట్టం ప్రకారం సీఈసీకి నేర విచారణ నుంచి మినహాయింపు ఉన్నందున, చట్టబద్ధమైన రక్షణ లేని జుజ× చీజు నిర్వాహకురాలు సీమా ఖన్నాపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. చట్టవిరుద్ధంగా సాగిన ఈ నిర్ణయాల నేపథ్యంలో గత జూన్ నుంచి ఏప్రిల్ వరకు జరిగిన ఎన్నికలను రద్దు చేసే అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించాలని సిబల్ విజ్ఞప్తి చేశారు.

**సీజేపీకి మద్దతు తెలిపిన సోనమ్ వాంగ్‌చుక్**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా అక్టోబర్ 2న 'కాక్రోచ్ జనతా పార్టీ' తలపెట్టనున్న ఆందోళనకు ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మద్దతు ప్రకటించారు. దేశంలో జవాబుదారీతనాన్ని, ఎన్నికల ప్రక్రియను మెరుగుపరిచేందుకు జరిగే ప్రయత్నాలకు తన మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అయితే ఈ ఉద్యమంలో తాను భౌతికంగా పాల్గొనకపోవచ్చన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ అనేది అత్యంత కీలకమని వాంగ్‌చూక్ పేర్కొన్నారు. ఆ ప్రక్రియే దెబ్బతింటే, ఇక ప్రజాస్వామ్యానికి విలువేముంటుందని ప్రశ్నించారు. ప్రభుత్వాలు తామిచ్చిన హామీలను కచ్చితంగా నెరవేర్చాలన్నారు. లద్దాఖ్‌కు 6వ షెడ్యూల్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని వాంగ్‌చూక్ డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌కు సంబంధించి సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని, ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాలను ఆయన పట్టించుకోలేదన్న మీడియా కథనాలతో దుమారం రేగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘంలో జవాబుదారీతనం కోరుతూ అక్టోబర్ 2న సీజేపీ ముంబయిలో ఆందోళన చేపట్టనున్నట్లు ప్రకటించింది.

# లాటరీ గెలవలేదని షాప్ ఓనర్‌పై దాడి

లాటరీ టికెట్ కొన్నారు. అదృష్టం కలిసి రాలేదు. ప్రైజ్ రాలేదని కోపంతో షాప్ ఓనర్‌పైనే దాడి చేశారు. కేరళలో జరిగిన ఆ ఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఇదే కేరళలో తాజాగా ఏకంగా రూ.30 కోట్ల థిరువోణం బంపర్ లాటరీ విజేత ఎవరో కూడా ఇంకా బయటకు రాలేదు. ఇంత పెద్ద మొత్తం గెలిస్తే ఏం చేయాలి టికెట్‌ను ఎలా భద్రపరచాలి డబ్బు పొందేందుకు ఎలాంటి పత్రాలు కావాలి తెలుసుకుందాం. కేరళలోని వయనాడ్ నంబియార్‌కున్నులో ఆదివారం ఈ ఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, తమిళనాడుకు చెందిన శివకుమార్ తరచూ వయనాడ్‌కు వచ్చి లాటరీ టికెట్లు కొనుగోలు చేసేవాడు. అయితే తాను కొన్న టికెట్లలో ఒక్కదానికీ ప్రైజ్ రాలేదని అసంతృప్తిగా ఉన్నాడు. ఆదివారం ఉదయం మద్యం మత్తులో లాటరీ షాప్‌కు వచ్చిన శివకుమార్, టికెట్ల విషయంలో విక్రేత వినిత రాజేశ్‌తో గొడవకు దిగినట్లు పోలీసులు తెలిపారు. ఆ తర్వాత కోపంలో ఆమె మెడపై కత్తితో దాడి చేయడంతో పాటు తలకు కూడా గాయాలు చేసినట్లు చెప్పారు. స్థానికులు వెంటనే జోక్యం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన వినితను సుల్తాన్ బతేరి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. పోలీసులు శివకుమార్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**రూ.30 కోట్ల విజేత ఎక్కడ?**

ఇదిలా ఉంటే కేరళ లాటరీ చరిత్రలోనే అత్యధికంగా ప్రకటించిన రూ.30 కోట్ల థిరువోణం బంపర్ ప్రైజ్ విజేత మాత్రం ఇంకా బయటకు రాలేదు. ఈ ఏడాది థిరువోణం బంపర్ లాటరీ టికెట్ నంబర్ ౡ 360615. ఆ టికెట్ కన్నూర్ జిల్లా చక్కరకల్‌లోని ముత్తు లాటరీ ఏజెన్సీ ద్వారా విక్రయమైంది. ఏజెన్సీ సబ్‌ఏజెంట్ అనీష్ ఎం.వి. ఈ టికెట్‌ను విక్రయించినట్లు అధికారులు గుర్తించారు. ఇదే ఏజెన్సీ గత క్రిస్మస్-న్యూ ఇయర్ బంపర్ విజేత టికెట్‌ను కూడా విక్రయించింది. టికెట్ విక్రయించిన ఏజెన్సీకి 12 శాతం కమిషన్‌గా సుమారు రూ.3.60 కోట్లు వచ్చే అవకాశం ఉంది. అయితే అసలు రూ.30 కోట్ల విజేత మాత్రం ఇప్పటివరకు లాటరీ అధికారులను సంప్రదించలేదు. విజేత ఒరిజినల్ టికెట్‌తో 30 రోజుల్లోగా క్లెయిమ్ చేసుకోవాల్సి ఉంటుంది. లాటరీ గెలిచిన వెంటనే ఉత్సాహంలో టికెట్‌ను ఎక్కడపడితే అక్కడ పెట్టడం మాత్రం చేయకూడదు. ముందుగా టికెట్‌ను భద్రంగా ఉంచుకోవాలి. టికెట్ వెనుక భాగంలో పేరు, చిరునామా, సంతకం రాయాలని లాటరీ శాఖ సూచనలు చెబుతున్నాయి. ఆ తర్వాత టికెట్ ముందు, వెనుక భాగాలను స్పష్టంగా కనిపించేలా ఫొటోకాపీలు తీసుకోవడం మంచిది. ఒరిజినల్ టికెట్ చినిగిపోకుండా, తడవకుండా జాగ్రత్తగా ఉంచాలి. ప్రైజ్ గెలిచిన టికెట్‌ను గుర్తింపు పత్రాలతో కలిసి ప్రభుత్వ లాటరీ కార్యాలయం లేదా నిబంధనలకు అనుగుణంగా బ్యాంకులో సమర్పించవచ్చు. ప్రభుత్వ గెజిట్‌లో వచ్చిన ఫలితాలను పరిశీలించి, నిర్ణీత సమయంలోపు టికెట్‌ను సమర్పించాలి.

## భారత రైల్వేలో కొత్త శకం




భారత రైల్వే చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది. దేశంలోనే తొలిసారిగా ద్రవీకృత సహజ వాయువు (ౡచీ+) ఇంధనంతో నడిచే రైలును కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఆదివారం సబర్మతిలో జెండా ఊపి ప్రారంభించారు. రైల్వే కార్యకలాపాల్లో డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా ఎల్ఎన్‌జీ వాడకానికి ఈ కార్యక్రమం శ్రీకారం చుట్టింది. సాంప్రదాయ డీజిల్ ఇంధనంపై ఆధారపడటాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ప్రోత్సహించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఇందుకోసం డ్రైవింగ్ పవర్ కార్స్ (ఞూజ) ఇంజిన్లను డీజిల్-ప్లస్-ఎల్ఎన్‌జీ డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్‌గా అభివృద్ధి చేశారు. సబర్మతి ఇంటిగ్రేటెడ్ కోచింగ్ డిపోలో 1,400 హార్స్‌పవర్ సామర్థ్యం గల రెండు డీపీసీలను ఈ కొత్త విధానానికి మార్చారు. ఈ టెక్నాలజీ పనితీరును నిర్ధారించుకునేందుకు, మార్పిడి చేసిన రెండు డీపీసీలపై 2,000 కిలోమీటర్లకు పైగా ఫీల్డ్ ట్రయల్స్ విజయవంతంగా పూర్తి చేశారు. రైల్వే శాఖ విడుదల చేసిన ట్రయల్ డేటా ప్రకారం, ఈ డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్ ద్వారా డీజిల్ వాడకాన్ని 40 శాతం వరకు తగ్గించవచ్చు. దీనివల్ల ఇంధన ఖర్చు గణనీయంగా ఆదా అవ్వడంతో పాటు కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ల వంటి కాలుష్య కారకాల ఉద్గారాలు కూడా తగ్గుతాయి. ఒక డీపీసీపై ఏటా రూ.11.9 లక్షలు, ఎనిమిది కోచ్‌ల రైలుపై సుమారు రూ.23.9 లక్షల వరకు ఆదా అవుతుందని రైల్వే శాఖ అంచనా వేసింది. ప్రతి డీపీసీలో 2,200 లీటర్ల సామర్థ్యంతో కూడిన ఎల్ఎన్‌జీ ట్యాంకును అమర్చారు. ఇందులో 850-900 కిలోల వరకు ఎల్ఎన్‌జీని నింపవచ్చు. ఒక్కసారి ట్యాంకును పూర్తిగా నింపితే రైలు సుమారు 1,600 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. ఈ పర్యటనలో భాగంగా అమిత్ షా రూ.1,542 కోట్లకు పైగా విలువైన పలు రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇందులో భాగంగా సబర్మతిలో రూ.700 కోట్లతో నిర్మించిన ఔూ+-12 లోకోమోటివ్ నిర్వహణ షెడ్‌ను ప్రారంభించి, ఒక ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ను జెండా ఊపి పంపించారు. వీటితో పాటు అహ్మదాబాద్-పాలన్‌పూర్, అహ్మదాబాద్-సమఖియాలీ సెక్షన్లలో దేశీయ పరిజ్ఞానంతో తయారైన 'కవచ్' రైలు రక్షణ వ్యవస్థను, రెండు రైల్వే సెక్షన్లలో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను, సబర్మతి-సర్ఖేజ్ సెక్షన్ డబ్లింగ్ పనులను కూడా ప్రారంభించారు. రైలు పనితీరుకు ఎలాంటి ఆటంకం లేకుండా ఖర్చులను, కాలుష్యాన్ని తగ్గించేందుకు రైల్వే శాఖ చేస్తున్న ప్రయోగాలకు ఈ ఎల్ఎన్‌జీ రైలు నిదర్శనంగా నిలుస్తోంది.

## ఆర్టీఐ పరిధి నుంచి 'లా అండ్ ఆర్డర్' శాఖకు మినహాయింపు

తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అత్యంత కీలకమైన పబ్లిక్ (శాంతిభద్రతలు) విభాగాన్ని సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం-2005 పరిధి నుంచి మినహాయించింది. ఈ శాఖను "ఇంటెలిజెన్స్ మరియు సెక్యూరిటీ ఆర్గనైజేషన్" (గూఢచార, భద్రతా సంస్థ)గా వర్గీకరిస్తూ అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రంలో పారదర్శకత, జవాబుదారీతనంపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే, తమిళనాడు ప్రభుత్వం 2026 సెప్టెంబర్ 21న మానవ వనరుల నిర్వహణ శాఖ ద్వారా +.ా. వీం.చీశీ.57 పేరిట ఒక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 24(4) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి ఈ మినహాయింపు ఇచ్చినట్లు అందులో పేర్కొంది. ఈ సెక్షన్ ప్రకారం, రాష్ట్రాలు తమ పరిధిలోని గూఢచార, భద్రతా సంస్థలను ఆర్టీఐ చట్టం నుంచి మినహాయించే వెసులుబాటు ఉంది. ఇప్పుడు ఇదే నిబంధనను ఉపయోగించి, శాంతిభద్రతలను పర్యవేక్షించే ప్రధాన విభాగాన్ని ఈ జాబితాలో చేర్చారు. ఈ నిర్ణయం వల్ల... ఇకపై రాష్ట్రంలో జరిగే మత ఘర్షణలు, రాజకీయ ఆందోళనలు, పోలీసుల కాల్పులు, కస్టడీ మరణాలు, నిరసనలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని ఆర్టీఐ ద్వారా పొందే అవకాశం ప్రజలకు ఉండదు. శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయాన్నీ ప్రశ్నించడం లేదా సమాచారం కోరడం సాధ్యపడదు. సాధారణంగా శాంతిభద్రతల విభాగం ప్రభుత్వ పరిపాలనలో అంతర్భాగం. దానిని ఒక గూఢచార సంస్థగా వర్గీకరించి ఆర్టీఐ నుంచి మినహాయించడం అనూహ్యమైన పరిణామం. ఈ చర్యతో పౌరులు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులు కీలకమైన సమాచారాన్ని తెలుసుకునే హక్కును కోల్పోతారు. ఇది ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకతను దెబ్బతీస్తుందని, అధికార దుర్వినియోగానికి ఆస్కారం కల్పిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా ఈ నిర్ణయం తమిళనాడులో తీవ్ర చర్చకు దారితీసింది.

## 'మేక్ ఇన్ ఇండియా'తో వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి సాధించాలి



చిన్న స్క్రూల నుంచి చిప్స్, పూర్తిస్థాయి ఆయుధ వ్యవస్థల వరకు అన్నీ దేశంలోనే తయారు చేయడం ద్వారా భారత్ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని సాధిస్తుందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. దేశం ప్రస్తుతం అదే దిశగా ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. ఈరోజు జరిగిన 'ఎన్డీటీవీ' డిఫెన్స్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ, 'మేక్ ఇన్ ఇండియా' విధానం వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరించారు. "మన సిద్ధాంతం చాలా సులభం. ఇక్కడ తయారు చేయగలిగిన వస్తువును బయట నుంచి ఎందుకు కొనుగోలు చేయాలి? దీన్నే మనం స్వావలంబన అంటాం. చిప్స్ నుంచి నౌకల వరకు, స్క్రూల నుంచి సంపూర్ణ ఆయుధ వ్యవస్థల వరకు దేశీయంగా తయారుచేయడం ద్వారానే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి సాధ్యమవుతుంది" అని రాజ్‌నాథ్ సింగ్ నొక్కిచెప్పారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడానికి భారత్ సన్నద్ధతపై మాట్లాడుతూ, రక్షణ రంగంలో ఇప్పటికే కీలకమైన, నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టామని తెలిపారు. "మేము కేవలం ప్రస్తుత అవసరాలను తీర్చడానికే పరిమితం కాలేదు. స్వావలంబన, భవిష్యత్ లక్ష్యాలతో ముందుకు వెళుతున్నాం. రక్షణ రంగం వేగం పుంజుకుంది" అని ఆయన వివరించారు. టెలికాం రంగంలో 2జీ నుంచి 5జీకి మారిన వృద్ధిని ఉదాహరణగా చూపుతూ, యుద్ధ తంత్రాలు కూడా ఇప్పుడు 5వ తరంలోకి ప్రవేశించాయని అన్నారు. "ప్రస్తుతం 5వ తరం యుద్ధాలపై చర్చ జరుగుతోంది. మారుతున్న ఈ వాతావరణంలో ప్రధానమంత్రి నాయకత్వంలో మన రక్షణ సన్నద్ధత కూడా అభివృద్ధి చెందుతోంది. స్వదేశీ క్వాంటం టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నాం. కాంటాక్ట్, నాన్-కాంటాక్ట్, కైనెటిక్, నాన్-కైనెటిక్ యుద్ధాల్లో మన సామర్థ్యాలను బలోపేతం చేసుకుంటున్నాం" అని తెలిపారు. భవిష్యత్తులో యుద్ధాలు 'మల్టీ-డొమైన్ ఎన్విరాన్‌మెంట్'లో జరుగుతాయని, పూర్తిగా టెక్నాలజీ ఆధారితంగా ఉంటాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. "ఆధునిక సైనికుడు కేవలం సైనికుడు మాత్రమే కాదు. వారు మల్టీ-డొమైన్‌లో పనిచేస్తారు. భవిష్యత్తులో యుద్ధ క్షేత్రం టెక్నాలజీతో నడుస్తుంది. టెక్నాలజీలో ఏ దేశం ముందుంటుందో, యుద్ధంలోనూ అదే దేశం ముందుంటుంది. మన రక్షణ వ్యూహం భవిష్యత్ సవాళ్లకు సిద్ధంగా ఉంది" అని ఆయన భరోసా ఇచ్చారు.

బిజినెస్

# ఎన్‌పీ ఎస్ స్వస్థ్య స్కీమ్


## పీఎఫ్ఆర్డీఏ కొత్త మార్గదర్శకాలివే

పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్డీఏ).. నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) కింద ఎన్‌పీఎస్ స్వస్థ్య కోసం ఇటీవల కార్యాచరణ మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ పథకం ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలతో రిటైర్మెంట్ సేవింగ్స్‌కు పెద్దపీట వేస్తున్నది. అందుకే ఓ సూపర్ టాప్-అప్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తప్పనిసరి. ఎన్‌పీఎస్‌కు అర్హత ఉన్నవారు ఎవరైనా పీఎఫ్ఆర్డీఏ షరతులు, మార్గదర్శకాలకు లోబడి ఎన్‌పీఎస్ స్వస్థ్యలో చేరవచ్చు. ఇందులో రెండు భాగాలుంటాయి. ఒకటి పెట్టుబడి ఖాతా, మరొకటి బీమా పాలసీ ఉంటాయి.

తొలి చందా తప్పనిసరిగా మొదటి సంవత్సరం బీమా ప్రీమియంను కవర్ చేసేలా ఉండాలి. ఎన్‌పీఎస్ స్వస్థ్య ఖాతాలో ఏటా కనీసం రూ.1,000 పెట్టుబడి పెట్టాలి. పెట్టుబడి కోసం చందా చెల్లించే ప్రతిసారి మీ ఖాతాకు కనీసం రూ.10 పెంచుకుంటూపోవాలి.

18-40, 40-60, 60-70 ఏండ్లవారికి వేర్వేరు ప్రీమియంలు. ప్రీమియం, పాలసీ షరతులకు లోబడి 85 ఏండ్లదాకా పొడిగించుకోవచ్చు. అలాగే హెల్త్ బెనిఫిట్ అడ్మినిస్ట్రేటర్ కోసం రూ.200 వార్షిక నిర్వహణ చార్జీ చెల్లించాలి. పన్నులు అదనం.

రూ.1 లక్ష, రూ.5 లక్షలు, రూ.10 లక్షలు, రూ.30 లక్షల ఆరోగ్య బీమా ఆప్షన్లుంటాయి. వీటికి ప్రీమియంలు వరుసగా రూ.10,000, రూ.50,000, లక్ష రూపాయలు, రూ.3 లక్షలుగా ఉంటాయి. కనీస కార్పస్ రూ.25,000.




పేర్కొన్న వైద్య ఖర్చుల కోసం పాక్షిక ఉపసంహరణలకు వీలుంటుంది. హెల్త్‌కేర్ విత్‌డ్రాయల్స్ కోసం ఎలాంటి వెయింటింగ్ పీరియడ్ ఉండదు. సాధారణ, ప్రీమెచ్యూర్ ఎగ్జిట్‌లతోపాటు, నగదు చెల్లించకపోతే, సబ్‌స్క్రైబర్ చనిపోతే ఎన్‌పీఎస్ స్వస్థ్య ఖాతా క్లోజ్ అవుతుంది.

స్టాండర్డ్ పాలసీలో ఫ్యామిలీ ఫ్లోటర్ కింద సబ్‌స్క్రైబర్‌తోపాటు, వారి భాగస్వామి, ఇద్దరు సంతానానికి (పిల్లలు) ఆరోగ్య బీమా కవరేజీ ఉంటుంది. సబ్‌స్క్రైబర్ తల్లిదండ్రులకు మాత్రం వర్తించదు.

## ఇంటి కోసం ఎంత?

### అర్హత, మారిన నిబంధనలు ఏమిటి?



ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) సభ్యులు ఇంటి సంబంధిత అవసరాల కోసం తమ ఈపీఎఫ్ ఖాతా నుంచి నగదును ఉపసంహరించుకోవచ్చు. ఇటీవలి ఈపీఎఫ్‌వో మార్గదర్శకాల ప్రకారం.. సభ్యత్వం పొంది ఏడాది దాటితే అందుబాటులో ఉన్న మొత్తం నిధిలో నిబంధనలకు లోబడి 75 శాతం వరకు వెనుకకు తీసుకోవచ్చు. ఈ సొమ్మును ఇంటి కొనుగోలు, నిర్మాణం, మరమ్మతులు, నవీకరణ, ఇప్పటికే ఉన్న గృహ రుణాన్ని తీర్చేందుకు వాడుకోవచ్చు. అలాగే ఈపీఎఫ్‌వో సంస్కరణల్లో భాగంగా మారిన నిబంధనల ప్రకారం ఈపీఎఫ్ సభ్యులు తమ ఉద్యోగ జీవితకాలంలో గరిష్ఠంగా ఐదుసార్లు ఇంటి కోసం నగదు ఉపసంహరణలు చేసుకోవచ్చు.

### సరళతర విధానం

గతంలో ఉన్న 13 రకాల పాక్షిక ఉపసంహరణ నిబంధనలను ఇప్పుడు ఒకే సమగ్రమైన, సరళీకృత విధానంలోకి విలీనం చేశారు. మునుపు సభ్యుడు నగదు ఉపసంహరించుకుంటే ఉద్యోగి చందా, వడ్డీ ఆదాయంలో నుంచి మాత్రమే వచ్చేది. ఇప్పుడు సంస్థ చెల్లించే చందాలో నుంచి కూడా నగదును ఇస్తుండటం గమనార్హం. దీంతో మరింత నగదు చేతికి అందుతున్నది. అలాగే అనారోగ్యంబారినపడ్డ సభ్యులు వైద్య ఖర్చుల నిమిత్తం ఉపసంహరణలకు దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి పరిమితులూ లేవు. మిగతా అవసరాలకు మాత్రం పరిమితులున్నాయి.

### మిగతా అవసరాల్లో..

వైద్య ఖర్చులు: వ్యక్తిగత లేదా కుటుంబ సభ్యుల వైద్య ఖర్చుల కోసం ఈపీఎఫ్ సభ్యులు ఖాతా నుంచి నగదును ఎన్నిసార్లైనా తీసుకోవచ్చు. అయితే ఈ మేరకు వర్తించే ఈపీఎఫ్ నిబంధనలకు లోబడి క్లెయిమ్‌ల పరిష్కారం ఉంటుంది. చదువుల ఫీజులు: తమ లేదా పిల్లల చదువు ఖర్చుల కోసం కూడా ఈపీఎఫ్ నగదును వెనుకకు తీసుకోవచ్చు. సభ్యత్వం కాలవ్యవధిలో 10సార్లు ఈ అవకాశం ఉంటుంది.

పెండ్లి కోసం: తమ లేదా అర్హులైన కుటుంబ సభ్యుల వివాహ ఖర్చుల నిమిత్తం సభ్యులు ఈపీఎఫ్ సొమ్మును తీసుకోవచ్చు. అయితే సభ్యత్వకాలంలో ఇందుకు ఐదుసార్లు మాత్రమే వీలున్నది.

ఇతరాలు: కేంద్ర ట్రస్టీల బోర్డు ప్రకటించిన ప్రత్యేక పరిస్థితుల్లోనూ ఈపీఎఫ్ అడ్వాన్స్‌ల కోసం సభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఒక ఆర్థిక సంవత్సరంలో రెండుసార్లు మాత్రమే ఇందుకు అవకాశం ఉంటుంది.

హౌసింగ్ కోసం ఈపీఎఫ్ అడ్వాన్స్ ఎంత?
ప్రస్తుత ఈపీఎఫ్‌వో నిబంధనల ప్రకారం సభ్యులు తమ బ్యాలెన్స్‌లో 75 శాతం వరకు తీసుకోవచ్చు
అవసరాలు
ఇల్లు, ఫ్లాట్ లేదా స్థలం కొనుగోలుకు ఇంటి నిర్మాణానికిగృహ రుణం తీర్చడానికిమరమ్మతులు, ఇల్లు నవీకరణకు
అర్హత
ఈపీఎఫ్ సభ్యత్వం వచ్చిన 12 నెలల తర్వాత అర్హులు
ఎన్నిసార్లు?
సభ్యత్వ కాలంలో గరిష్ఠంగా ఐదుసార్లు
ఈపీఎఫ్‌వో మెంబర్ పోర్టల్ ద్వారా ఫామ్ 31 సమర్పించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు

# నయా ‘ఎఫ్‌డీ’ క్రెడిట్ కార్డ్

ఎస్బీఐ కార్డ్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఆధారిత సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులను పరిచయం చేసింది. ఎస్బీఐ యోనోపై ఇవి అందుబాటులో ఉంటాయి. కావాలనుకునే ఖాతాదారులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక వీటిలో ఎలైట్, ప్రైమ్, సింప్లీక్లిక్, సింప్లీసేవ్ అనే నాలుగు రకాల కార్డులున్నాయి. అయితే ఎలైట్, ప్రైమ్ కార్డులు ప్రీమియం కార్డ్ ఆప్షన్లుగా ఉన్నాయి. అలాగే ఆన్‌లైన్ షాపింగ్ ప్రయోజనాలను కొరుకునేవారి కోసం సింప్లీక్లిక్, రోజువారి ఖర్చులు-ఆదా ప్రయోజనాల కోసం సింప్లీసేవ్ కార్డులను రూపొందించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)లో ఎఫ్‌డీ ఖాతా ఉన్నవారు ఎస్బీఐ యోనో యాప్ ద్వారా ఈ సెక్యూర్డ్ అడ్వాంటేజ్ ఎస్బీఐ కార్డ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తిగా పేపర్‌లెస్ అప్లికేషన్ ఇది. అంతా ఆన్‌లైన్‌లోనే జరిగిపోతుంది. ఇక మీరు తీసుకునే క్రెడిట్ కార్డుకు సెక్యూరిటీగా మీ ఎఫ్‌డీ ఉంటుంది. కాబట్టి రెగ్యులర్ అన్‌సెక్యూర్డ్ క్రెడిట్ కార్డుకు ఇది పూర్తిగా భిన్నం. సంప్రదాయ క్రెడిట్ కార్డులను బ్యాంకులు.. ఆయా కస్టమర్ల క్రెడిట్ స్కోర్, ఆదాయం, రుణ చెల్లింపుల చరిత్ర, ఇతరత్రా అర్హతల ఆధారంగా ఇస్తాయి. అయితే ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డుల మంజూరుకు ఇందులో దేన్ని కూడా బ్యాంకులు చూడవు. మీరు చేసే ఎఫ్‌డీనే హామీగా మీకు ఈ క్రెడిట్ కార్డ్ వస్తుంది మరి. అయితే మీ ఎఫ్‌డీ ఆధారంగానే క్రెడిట్ కార్డ్ ఖర్చుల పరిమితి ఉంటుంది.




# గిల్, కోహ్లీ షో

## తొలి వన్డేలో భారత్ ఘనవిజయం

సెంచరీలతో కదం తొక్కిన ప్రస్తుత, మాజీ సారథులు
మెరిసిన కుల్‌దీప్.. గ్రీవ్స్ పోరాటం వృథా

**తిరువనంతపురం:** వన్డే ప్రపంచకప్ సన్నాహకాలను భారత్ ఘనంగా ఆరంభించింది. సొంతగడ్డపై వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడుతున్న భారత్.. ఆదివారం తిరువనంతపురం వేదికగా జరిగిన తొలి వన్డేలో ప్రత్యర్థిపై 8 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని నమోదుచేసింది. ‘ఛేదనలో మొనగాడు’ విరాట్ కోహ్లీ (88 బంతుల్లో 10 ఫోర్లు, 9 సిక్స్‌లతో 139 నాటౌట్) కెరీర్‌లో 86వ (మూడు ఫార్మాట్లలో కలిపి) సెంచరీతో చెలరేగిన వేళ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (108 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్‌తో 110) సారథిగా రెండో శతకాన్ని బాదడంతో విండీస్ నిర్దేశించిన 296 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా 41.4 ఓవర్లలోనే రెండు వికెట్లే కోల్పోయి ఛేదించింది. మొదట కరీబియన్ జట్టుకు జస్టిన్ గ్రీవ్స్ (108 బంతుల్లో 12 ఫోర్లతో 101) సెంచరీ చేయగా జాన్ క్యాంప్‌బెల్ (62), అమిర్ జాంగూ (53 నాటౌట్) రాణించడంతో 295/7 స్కోరు చేయగల్గింది. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ (4/40)కు నాలుగు వికెట్లు దక్కాయి. అతడికే ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’ అవార్డు దక్కింది. ఈనెల 30న గువాహతి వేదికగా రెండో వన్డే జరుగుతుంది.

### తాజా, మాజీ కెప్టెన్ల జోరు

భారత టాపార్డర్ జూలు విదిల్చడంతో విండీస్ లక్ష్యం ఏమాత్రమూ సరిపోలేదు. తన మాజీ సారథులు రోహిత్ శర్మ (32), కోహ్లీతో కలిసి ప్రస్తుత కెప్టెన్ గిల్ రెచ్చిపోయాడు. ఇన్నింగ్స్‌ను నెమ్మదిగా ఆరంభించినా క్రీజులో కుదురుకున్నాక రోహిత్, గిల్ జోడీ జోరందుకోవడంతో ఆతిథ్య జట్టుకు శుభారంభమే దక్కింది. ఫోర్దే, అల్జారీ జోసెఫ్ ఓవర్లో డీప్ వికెట్ మీదుగా రోహిత్ కొట్టిన సిక్సర్లు ప్రేక్షకులను అలరించాయి. గిల్ సైతం బౌండరీలతో విరుచుకుపడగా పది ఓవర్లలో భారత్ వికెట్లేమీ నష్టపోకుండా 70 రన్స్ చేసింది. అయితే జోసెఫ్ 12వ ఓవర్లో బంతిని డీప్ స్కేర్ లెగ్‌లో ఆడబోయిన హిట్‌మ్యాన్.. ఆండ్రూ చేతికి చిక్కడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. అప్పటికే 40ల్లోకి వచ్చిన గిల్.. ఆ తర్వాత



కోహ్లీ అండతో మరింతర రెచ్చిపోయాడు. ఛేజ్ ఓవర్లో సింగిల్ తీసి ఫిఫ్టీ పూర్తిచేశాడు. ఇద్దరూ క్రీజులో సెట్ అయ్యాక విండీస్ బౌలర్లు, ఫీల్డర్లు వారి విన్యాసాలను దగ్గర్నుంచి చూడటం తప్ప వికెట్లు తీయాలన్న ఆలోచనే మరిచిపోయారా? అన్నట్టు వారి ఆట సాగింది. జోసెఫ్ బౌలింగ్‌లో కీపర్ తలమీదుగా సిక్స్‌తో పరుగుల వేట మొదలెట్టిన విరాట్.. 44 పరుగుల వద్ద ఉండగా అతడి బౌలింగ్‌లోనే సిక్స్‌తో అర్ధ శతకాన్ని పూర్తిచేశాడు. ఆ తర్వాత జోసెఫ్ విసిరిన 29వ ఓవర్లో రెండు బౌండరీలు బాదడంతో వన్డేల్లో ‘రన్ మిషీన్’ 15వేల పరుగుల మార్కును అందుకున్నాడు. ఆ తర్వాతి ఓవర్లోనే భారత అభిమానుల ఆనందాన్ని రెట్టింపు చేస్తూ సీల్స్ ఓవర్లో బౌండరీతో వన్డేల్లో గిల్ 11వ శతకం పూర్తవడమే గాక భారత్ స్కోరూ 200 పరుగులు దాటింది. శతకం పూర్తయ్యాక గిల్ నిష్క్రమణతో 151 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. గిల్ వెళ్లేసరికే 80ల్లోకి వచ్చిన విరాట్.. రుతురాజ్ (13)ను అవతలి ఎండ్‌లో ఉంచి లాంఛనాన్ని ముగించే బాధ్యతలు భుజానికెత్తుకున్నాడు. లాంగాన్‌లో చూడముచ్చటైన సిక్స్‌తో శతకానికి చేరువైన అతడు 94 రన్స్ వద్ద గుడకేశ్ బౌలింగ్‌లో ముందుకొచ్చి మరోసారి లాంగాన్‌లోనే సిక్స్‌తో వన్డేల్లో 55వ సెంచరీని నమోదుచేశాడు. సెంచరీ తర్వాత జోరు పెంచిన కోహ్లీ.. సిక్స్‌లు, ఫోర్లతో లాంఛనాన్ని పూర్తిచేశాడు.

### గ్రీవ్స్ రాణించినా..

విండీస్ ఇన్నింగ్స్‌లో ఆటంతా ఓపెనర్లదే. సిరాజ్, బుమ్రా వంటి ఫ్రంట్‌లైన్ బౌలర్లు లేని భారత బౌలింగ్‌ను క్యాంప్‌బెల్, గ్రీవ్స్ జోడీ ఉతికారేసింది. ఇద్దరూ మొదట్నుంచే దూకుడుగా ఆడటంతో స్కోరుబోర్డు పరుగులు పెట్టింది. బ్రార్, నితీశ్, ప్రసిద్ధ్.. ఏమాత్రం ప్రభావం చూపకపోయారు. రవీంద్ర జడేజా సైతం నిరాశపరిచాడు. అర్ధ శతకాల తర్వాత ఈ జోడీని 20వ ఓవర్లో ఎట్టకేలకు విడదీసిన కుల్‌దీప్ భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. క్యాంప్‌బెల్ ఔటయ్యాక విండీస్ ఇన్నింగ్స్ గాడి తప్పింది. కార్టీ (13)ని ప్రసిద్ధ్, కెప్టెన్ షై హోప్ (12)ను కుల్‌దీప్ పెవిలియన్‌కు పంపారు. నిలకడగా ఆడిన గ్రీవ్స్.. జడేజా బౌలింగ్‌లో సింగిల్‌తో తన వన్డే కెరీర్‌లో తొలి శతకాన్ని సాధించాడు. కానీ ఆ వెంటనే కుల్‌దీప్ బౌలింగ్‌లో వికెట్ల ముందు బలయ్యాడు. ఆఖర్లో అమిర్ మెరుపులతో పర్యాటక జట్టు మెరుగైన స్కోరు చేసింది.

### కోహ్లీ ఏ 15 వేలు

వన్డేల్లో కోహ్లీ మరో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. వ్యక్తిగత స్కోరు 57 పరుగుల వద్ద ఉండగా అతడు 15 వేల పరుగుల మైలురాయిని అధిగమించాడు. తద్వారా ఈ ఫార్మాట్‌లో సచిన్ టెండూల్కర్ (18,426) తర్వాత ఈ ఘనత సాధించిన రెండో బ్యాటర్‌గా కోహ్లీ (15,080) రికార్డులకెక్కాడు.

9 ఈ మ్యాచ్‌లో కోహ్లీ కొట్టిన సిక్స్‌లు. ఒక వన్డే మ్యాచ్‌లో ఇన్ని సిక్స్‌లు కొట్టడం అతడికి ఇదే ప్రథమం. శ్రీలం కపై 8 సిక్స్‌లు బాదాడు. 10 వెస్టిండీస్‌పై కోహ్లీ సెంచరీల సంఖ్య. ఒక జట్టుపై అత్యధిక సెంచరీలు చేసిన వారిలో అతడిదే అగ్రస్థానం. గతంలో శ్రీలంకపైనా ఈ ఘనత సాధించాడు. సచిన్, రోహిత్ (ఆస్ట్రేలియాపై 9) తదుపరి స్థానాల్లో ఉన్నారు.

సంక్షిప్త స్కోర్లు
వెస్టిండీస్: 50 ఓవర్లకు 295/7 (గ్రీవ్స్ 101, క్యాంప్‌బెల్ 62, కుల్‌దీప్ 4/40, ప్రసిద్ధ్ 2/60); భారత్: 41.4 ఓవర్లకు 300/2 (కోహ్లీ 139నా, గిల్ 110, ఛేజ్ 1/64, జోసెఫ్ 1/81)

స్పోర్ట్స్

## అబ్బాయిలకు వెండి.. అమ్మాయిలకు కాంస్యం




**సమర్‌కండ్:** ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన భారత్ ఈసారి రజతంతో సరిపెట్టుకుంది. ఆదివారం జరిగిన ఓపెన్ సెక్షన్ ఆఖరి రౌండ్ తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్.. హంగేరితో మ్యాచ్‌ను 2-2తో డ్రాగా ముగించింది. ఉజ్బెకిస్థాన్ జట్టు తమ చివరి మ్యాచ్‌లో 2.5-1.5తో ఉక్రెయిన్‌పై గెలిచి స్వర్ణం నెగ్గింది. ఆ జట్టు ఖాతాలో మొత్తంగా 20 పాయింట్లుండగా భారత్ 18 పాయింట్లతో నిలిచింది. ఇక అమ్మాయిల విభాగంలో 3-1తో చైనాను ఓడించినా కాంస్యంతోనే సంతృప్తి పడాల్సి వచ్చింది. విమెన్స్ కేటగిరీలో చైనాకు గోల్డ్, కజకిస్థాన్‌కు సిల్వర్ దక్కాయి.

## ఒక్కరోజులో మూడు మ్యాచ్‌లా?..

## ఆసియా క్రీడల నిర్వాహకులపై సింధు ఫైర్..!

ఆసియా క్రీడల్లో పతకం గెలవాలనుకున్న పీవీ సింధ కల చెదిరింది. క్వార్టర్ ఫైనల్లో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించిందీ తెలుగు తేజం. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో చెన్ యుఫీ(చైనా) చేతిలో కంగుతిన్న సింధు నిర్వాహకులపై మండిపడింది. ఒక్కరోజులో మూడు మ్యాచ్‌లు ఏంటీ? అసలు ఇదేం షెడ్యూల్? అంటూ ఫైర్ అయిందీ ఒలింపిక్ విజేత. అంతేకాదు కోర్టులో రివ్యూ కెమెరాలు లేకపోవడాన్ని కూడా సింధు తప్పుపట్టింది. జపాన్‌లోని ఐచీ నగోయలో జరుగుతున్న 18వ ఆసియా క్రీడల్లో పీవీ సింధు పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన సింధు క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. ఆదివారం చైనా షట్లర్ చెన్ యుఫీపై 21-11తో తొలి సెట్ గెలుపొందిన సింధు ఆ తర్వాత తడబడింది. నాలుగో సీడ్ ధాటికి వరసగా రెండు సెట్లను 18-21, 10-21తో కోల్పోయిన తెలుగుతేజం టోర్నీ నుంచి వైదొలిగింది. అయితే.. బిజీ షెడ్యూల్ కారణంగా సరిపోను మ్యాచ్ సన్నద్ధత లేకపోవడం వల్లనే తాను ఓటమి పాలయ్యానని సింధు వాపోయింది. భారత స్టార్ ఒక్క రోజులనే మూడు మ్యాచ్‌లు ఆడింది. శనివారం ఉదయం 12:07 గంటలకు రెండో మ్యాచ్ ఆడిన తను.. ఆదివారం చెన్ యుఫీతో క్వార్టర్ ఫైనల్ కోసం కోర్టుకు వచ్చేసింది. దాంతో.. తీరిక లేకుండా ఆడడం, నిద్ర లేకపోవడానికి తోడు సరైన నిర్వహణ లోపించడం కారణంగా పతకం చేజారిందని సింధు తెలిపింది.

# రోజూ నడక..
# ఆరోగ్యానికి అమృతం

## నిత్యం 30 నిమిషాల నడకతో ఎన్నో రోగాలకు దూరం

ఆరోగ్యంగా ఉండాలంటే ఎంతలా వ్యాయామం చేయాలో తెలియక చాలా మంది సందిగ్ధపడుతుంటారు. అయితే నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల నడక చేయడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, మధుమేహం, బీపీ, ఊబకాయం వంటి అనేక సమస్యల నుంచి కాపాడుతుంది. నడక అనేది అందరికీ అందుబాటులో ఉండే, సులభమైన మరియు ఖర్చు లేని వ్యాయామం.



## నడక వల్ల కలిగే ప్రయోజనాలు

**గుండె ఆరోగ్యం**
గుండె పనితీరును మెరుగుపరచి, రక్త ప్రసరణను పెంచుతుంది.

**మధుమేహం నియంత్రణ**
రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేస్తుంది.

**ఊబకాయం తగ్గింపు**
క్యాలరీలను ఖర్చు చేసి బరువును నియంత్రిస్తుంది.

**ఎముకలు, కండరాల బలం**
ఎముకలను దృఢంగా చేసి, కండరాలను శక్తివంతం చేస్తుంది.

**మానసిక ప్రశాంతత**
ఒత్తిడిని తగ్గించి, మంచి నిద్రకు సహాయపడుతుంది.

## నిపుణులు ఏమంటున్నారు?

"ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల నడక చేయడం వల్ల శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది, గుండె ఆరోగ్యం బలంగా ఉంటుంది. బరువు నియంత్రణకు, మానసిక ఉల్లాసానికి కూడా దోహదపడుతుంది."

## ఎలా నడవాలి?

ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం నడవడం అలవాటు చేసుకోవాలి.
సౌకర్యవంతమైన చెప్పులు ధరించాలి.
మొదట 10 నిమిషాలతో ప్రారంభించి, క్రమంగా 30 నిమిషాల వరకు పెంచాలి.
సాధ్యమైనంత వరకు స్వచ్ఛమైన గాలిలో నడవాలి.
నీళ్లు తాగడం మర్చిపోవద్దు.

**నడక మొదలు పెట్టండి..
ఆరోగ్యాన్ని కాపాడుకోండి..**



## వర్షాకాలంలో జాగ్రత్త.. డెంగ్యూ, వైరల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలంలో దోమల ద్వారా వచ్చే డెంగ్యూ, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి వైరల్ జ్వరాలు పెరిగే అవకాశం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీరు నిల్వ లేకుండా చూసుకోవడం, దోమల నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా ఈ జ్వరాల నుంచి రక్షణ పొందవచ్చని సూచిస్తున్నారు.



**దోమల నివారణే.. జ్వరాల నివారణ**

### ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు


ఇంటి చుట్టూ నీరు నిల్వ లేకుండా చూడాలి.
దోమతెరలను శుభ్రంగా ఉంచాలి.
పూర్తి చేతుల దుస్తులు, ప్యాంట్లు ధరించాలి.
దోమల కాయిల్స్, స్ప్రే వాడాలి.
జ్వరం లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
ఆరోగ్యమే మహాభాగ్యం.. జాగ్రత్తలతో మనల్ని మనం కాపాడుకుందాం..




# ‘ఆదర్శకుటుంబం’ వేరే లెవెల్

‘దాదాపుగా 20ఏళ్ల తర్వాత త్రివిక్రమ్‌తో కలిసి పనిచేశాను. తను రచన చేసిన నువ్వునాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలు క్లాసిక్ లవ్‌స్టోరీలుగా నిలిచాయి. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత నాకోసం అద్భుతమైన కథను తెచ్చారు త్రివిక్రమ్. ఇందులో అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి. ఊహించని ట్విస్టులుంటాయి. ట్రీట్మెంట్ కొత్తగా ఉంటుంది. ‘ఆదర్శకుటుంబ’ మామూలు కుటుంబం కాదు. ఇది వేరే లెవెల్. త్రివిక్రమ్ అద్భుతంగా హ్యాండిల్ చేశారు. మీరు కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు’ అని అగ్ర కథానాయకుడు వెంకటేశ్ నమ్మకం వెలిబుచ్చారు. ఆయన హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘ఆదర్శకుటుంబం: హౌస్ నెం 47 -- ఏఖ 47’. శ్రీనిధిశెట్టి కథానాయిక. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ప్రచారంలో భాగంగా ఈసినిమాలోని తొలి పాట ‘నారాయణమ్మ..’ను మేకర్స్ విడుదల చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో వెంకటేశ్ మాట్లాడారు. త్రివిక్రమ్ మాట్లాడుతూ ‘వెంకటేశ్‌గారి ‘పవిత్రబంధం’ సినిమాతో నా సినీప్రయాణం మొదలైంది. ‘నువ్వునాకు నచ్చావ్’తో మా బంధం బలపడింది. అందుకే ఆయనకు నేనెప్పుడూ కృతజ్ఞుడినై ఉంటా. ఈ పాట రామజోగయ్య అద్భుతంగా రాస్తే, అంతే అద్భుతంగా తమన్ స్వరపరిచారు. వెంకటేశ్‌గారితోపాటు శ్రీనిధిశెట్టి, డింపుల్ హయాతి, నివేద పేతురాజ్ పాటకు అందాన్ని తెచ్చారు. సినిమా కలర్‌ఫుల్‌గా ఉంటుంది’ అని తెలిపారు.

# రామాయణ దృశ్యమాలిక






ఎన్నిమార్లు విన్నా.. ఎన్నిసార్లు కన్నా.. తనివితీరని పుణ్యగాథ ‘రామాయణం’. అది మన దేశ సంపద. మన అస్తిత్వానికి ప్రతీక. అందుకే.. ఎన్నిసార్లు తెరకెక్కినా ఈ దృశ్యకావ్యాన్ని చూసేందుకు జనం సిద్ధంగానే ఉంటారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో దాదాపు 3వేల కోట్ల భారీ నిర్మాణ వ్యయంతో రెండు భాగాలుగా ‘రామాయణం’ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. నితీశ్ తివారీ దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈచిత్రంలో సీతారాములుగా సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తుండగా, రావణబ్రహ్మగా ‘కేజీఎఫ్’ఫేం యశ్ కనిపించనున్నారు. తొలి భాగం దీపావళి కానుకగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈసినిమా ప్రమోషన్స్‌ని మేకర్స్ వేగవంతం చేశారు. ఆదివారం ఈ సినిమా నుంచి రెండు పోస్టర్లను విడుదల చేశారు. అందులో తొలి పోస్టర్ సీతారామలక్ష్మణులది కాగా, రెండో పోస్టర్ రావణబ్రహ్మది. వనవాసకాలంలో సీతాలక్ష్మణ సమేతంగా ధనుర్బాణాలతో కనిపిస్తున్న రామచంద్రమూర్తిని తొలిపోస్టర్‌లో చూడొచ్చు. రాముడిగా రణబీర్‌కపూర్, సీతగా సాయిపల్లవి, లక్ష్మణుడిగా రవి దూబే ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. ఇక సర్వాలంకారభూషితుడైన రావణబ్రహ్మగా యశ్‌ని రెండో పోస్టర్‌లో చూడొచ్చు. మహాశక్తివంతుడు, బ్రహ్మజ్ఞాని, లంకాధీశుడైన రావణుడ్ని ఈ పోస్టర్‌లో అద్భుతంగా ఆవిష్కరించారు. ఇందులో రావణపత్ని మండోదరిగా కాజల్, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్న విషయం తెలిసిందే.

# ఆ రోజే నిజమైన డాటర్స్ డే

“ఆడవాళ్లకు నిజమైన స్వాతంత్ర్యం అంటే నేను నమ్మేది ఏంటంటే... ఒక ఆడపిల్ల రాత్రి పూట ఒంటరిగా నడవగలిగిన రోజు, చీకటి పడ్డాక పార్కులో కూర్చోగలిగిన రోజు, తనకు నచ్చిన దుస్తులు ధరించగలిగిన రోజు, ఎలాంటి భయం లేకుండా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఉపయోగించగలిగిన రోజు, అలానే పబ్లిక్ ప్లేస్‌లో ఉన్నప్పుడు ఎలాంటి ప్రమాదం పొంచి ఉందో అని ఆలోచించని రోజు... నిజమైన ‘డాటర్స్ డే’. ఆ రోజునే మనం నిజమైన డాటర్స్ డేని జరుపుకోవాలి” అని కృతీ సనన్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఆదివారం ‘డాటర్స్ డే’ని పురస్కరించుకుని ఆమె ఈ విధంగా అన్నారు. ఇంకా సమాజంలో ఆడపిల్లల భద్రత గురించి ఆమె షేర్ చేసుకున్న కొన్ని విషయాలు ఈ విధంగా... “మీ కూతురు మీకు ఫోన్ చేసి ‘నన్ను కొందరు పురుషులు వెంబడిస్తున్నట్లు అనిపిస్తోంది’ అని చెబుతున్నట్లు ఊహించుకోండి, రాత్రిపూట ఒంటరిగా నడుస్తూ, భయంతో వెనక్కి తిరిగి చూసుకోవడం... ఇంటికి చేరేలోపే మీ కూతురి ఫోన్ స్విచ్ఛాఫ్ అయిపోవడం... ఇలాంటి పరిస్థితులను ఒక్కసారి ఊహించుకుని చూడండి... వీటి గురించి లోతుగా ఆలోచించండి. అప్పుడు మన ఆడపిల్ల భద్రత లేని సమాజంలో ఉన్న విషయం ఇంకా బాగా అర్థం అవుతుంది. ఆడపిల్ల ఇంటికి క్షేమంగా చేరిన తర్వాత కుటుంబ సభ్యులకు ‘నేను ఇంటికి వచ్చేశాను’ అని ఫోన్ చేసి చెప్పాల్సిన అవసరం లేని రోజు రావాలి. అలాంటి సురక్షితమైన ప్రపంచాన్ని కూతుళ్లకు అందించాల్సిన బాధ్యత మన మీద ఉంది. ఆడపిల్ల బయటకు వెళ్లినప్పుడు లైవ్ లొకేషన్ షేర్ చేయడం, పెప్పర్ స్ప్రే వెంట తీసుకెళ్లడం, నడవడానికి బదులుగా క్యాబ్ బుక్ చేసుకోవడం, కేవలం సేఫ్‌గా భావించడం కోసం ఎవరికైనా ఫోన్ చేయడం... ఇవన్నీ కూడా తన జీవనశైలిలో భాగం చేసుకునేలా మనమే ఆమెను బలవంతం చేశాం” అంటూ కృతీ సనన్ షేర్ చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. కృతి చెప్పినది అక్షరాలా నిజం అని కొందరు, ఆడపిల్లల భద్రత విషయంలో ప్రపంచం చాలా మారాలని కొందరు నెటిజన్లు స్పందించారు.



# ప్రేమతో కూడిన హృదయం



తమిళ అగ్ర నటుడు విజయ్ సేతుపతి ప్రధానపాత్రలో టాలీవుడ్ ఫిల్మ్ మేకర్ పూరీ జగన్నాథ్ తెరకెక్కించిన పాన్ ఇండియా యాక్షన్ డ్రామా ‘స్లమ్ డాగ్ : 33 టెంపుల్ రోడ్’. త్వరలో సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా సినిమా ప్రచారాన్ని మేకర్స్ వేగవంతం చేశారు. తాజాగా ఇందులో కీలకపాత్ర పోషిస్తున్న జరీనా వహాబ్ ఫస్ట్‌లుక్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. ‘ప్రేమతో కూడిన హృదయం.. పోరాటాలతో నిండిన జీవితం’ అంటూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో పొందుపరచిన క్యాప్షన్ జరీనా వహాబ్ పాత్రపై, ఈ సినిమా కథపై ఆసక్తిని పెంచింది. ఇందులో ఆమె జుబైదాగా కనిపించనున్నారు. సంయుక్త మీనన్ కథానాయికగా, దునియా విజయ్ విలన్‌గా నటించిన ఈ పాన్ ఇండియా చిత్రానికి కెమెరా: సామ్ కె.నాయుడు, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, నిర్మాతలు: పూరీ జగన్నాథ్, చార్మీకౌర్, జె.బి.నారాయణ్‌రావు కొండ్రోళ్ల, నిర్మాణం: పూరీ కనెక్ట్స్.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com